'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి ‖ సంపుటి : 1 ‖ సంచిక : 91 ‖ సోమవారం ‖ 16.11.2026 ‖ పేజీలు : 8 ‖ వెల రూ. 2

Medchal Malkajgiri ‖ Volume: 1 ‖ Issue: 91 ‖ Monday ‖ 16.11.2026 ‖ Pages: 8 ‖ Rate: 2



బ్రిటన్ పౌరుడిగా మారిన లలిత్ మోదీ

ఆక్స్‌ఫర్డ్ వేదిక కొత్త జీవిత అధ్యాయం

ఇక లండన్ సొంతిల్లు అంటూ ప్రకటన

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వ్యవస్థాపకుడు లలిత్ మోదీ బ్రిటన్ పౌరసత్వం పొందారు. గత కొన్నేళ్లుగా లండన్‌లో నివసిస్తున్న ఆయన, ఇప్పుడు అధికారికంగా బ్రిటిష్ పౌరుడిగా మారిన విషయాన్ని వెల్లడించారు. నవంబర్ 14న ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో ప్రసంగించిన సందర్భంగా తన జీవితంలో జరిగిన ఈ ప్రత్యేక పరిణామాన్ని బహిరంగంగా ప్రకటించారు. (3లో..)



లడఖ్‌లో జలవిప్లవం

అమృత సరోవర్‌తో నీటి భద్రతకు భారీ ప్రణాళిక!

మంచుకొండల నడుమ నీటి నిల్వలకు కొత్త బాట

163 గ్రామాలకు భరోసా.. 55 కోట్ల లీటర్ల సామర్థ్యం

కరుగుతున్న మంచు.. పెరుగుతున్న నీటి కష్టాలు

ఒకవైపు మంచుకొండలు.. మరోవైపు ఎండిపోతున్న నీటి వనరులు! ప్రకృతి అందాలకు నిలయమైన లడఖ్‌లో ఇప్పుడు నీటి కొరత ప్రజల జీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. చలికాలంలో మంచు కురిసినా, వేసవిలో వ్యవసాయానికి అవసరమైన నీరు అందక గ్రామాలు అల్లాడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నీటి కోసం ప్రజలు సొంత ఊళ్లను వదిలి వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. (వివరాలు 3లో..)



సజ్జనార్‌పై సమగ్ర విచారణ జరపాలి

పెండింగ్ కేసులపై అనుమానాలు

ఫోన్ ట్యాపింగ్, భూ కొనుగోళ్లపై ఆరా

సీబీఐ దర్యాప్తునకు రాజాసింగ్ లేఖ!

హైదరాబాద్ మాజీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సజ్జనార్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో చోటుచేసుకున్న వివిధ పరిణామాలు, పెండింగ్‌లో ఉన్న కేసులపై అనేక సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు. (వివరాలు 2లో..)



కాంగ్రెస్‌దే ప్రజాస్వామ్య ఉల్లంఘన చరిత్ర!

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్

భారత్ సమ్మిట్‌పై రాంచందర్‌రావు విమర్శలు

కాంగ్రెస్ పార్టీనే గతంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించిందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్ ద్వారా విదేశీ శక్తులకు దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అవకాశం కల్పించారని విమర్శించారు. జార్జ్ సోరోస్ నిధులతో సంబంధం ఉన్న సంస్థల ప్రతినిధులను ఆహ్వానించారని ఆరోపిస్తూ, దేశ సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించే వ్యాఖ్యలను సహించబోమన్నారు. (వివరాలు 2లో..)

తుమ్మిడిహెట్టికై మహారాష్ట్రను ఒప్పించండి



ప్రాజెక్టులకు అనుమతులిప్పించాలన్న సీఎం

ఎల్‌నినో కరవు సాయం ఇవ్వాలని విజ్ఞప్తి

మోదీ చొరవ కీలకమన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు త్వరగా మంజూరుచేయాలనిముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఆదివారం ప్రధానమంత్రి అధికారిక నివాసంలో జరిగిన సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను వివరించారు. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. (వివరాలు 3లో..)



క్రీడా చరిత్రలో సంచలనం

ఖేలో ఇండియా కొత్త అధ్యాయం

యువ క్రీడాకారులకు భారీ వేదిక

క్రీడా సంబరాలకు సర్వం సిద్ధం

తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న ఎనిమిదో ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 రాష్ట్ర క్రీడా చరిత్రలో కీలక మైలురాయిగా నిలవనున్నాయి. ఈ పోటీలకు సంబంధించిన లోగో, మస్కట్‌ను కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ పోటీల నిర్వహణకు తెలంగాణను ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని క్రీడా ప్రారంభోత్సవానికి ఆహ్వానించామని, ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. (వివరాలు 2లో..)

రాహుల్ వెంట పరుగులేంటి?

• ఆత్మగౌరవమే రాష్ట్ర ఆవిర్భావ లక్ష్యం • కాంగ్రెస్, బీజేపీపై నేతల కేటీఆర్ ఫైర్



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే ప్రజల ఆత్మగౌరవం కోసం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలకు తెలంగాణ ఆత్మగౌరవం విలువ అర్థం కావడం లేదంటూ సోషల్ మీడియాలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతల వ్యవహారశైలిని ప్రస్తావిస్తూ, పదవుల గౌరవాన్ని కాపాడుకోవడంలో వారు విఫలమవుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాంధీ కుటుంబానికి బానిసగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు ఆయన బైక్ వెనుక పరుగులు తీయడాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు. ప్రజా ప్రతినిధులు తమ పదవుల హుందాతనాన్ని కాపాడుకోవాలని పరోక్షంగా వ్యాఖ్యానించారు (2లో..)

హరీశ్‌రావు నివాసానికి మాజీ సీఎం కేసీఆర్ రాక



సత్యనారాయణరావు సంవత్సరీక కార్యక్రమానికి హాజరు

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు నివాసానికి చేరుకున్నారు. హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు చిత్రపటానికి కేసీఆర్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి కార్యక్రమంలో పాల్గొన్నారు. (2లో..).



విదేశీ నేత నోట 'ఓట్ చోర్' నినాదం

ఇటలీ నేత వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

రాహుల్ నవ్వుపై బీజేపీ నేతల విమర్శలు

హైదరాబాద్‌లో శనివారం జరిగిన భారత్ సమ్మిట్ వేదికగా రాజకీయ వివాదం చెలరేగింది. ఇటలీకి చెందిన జియాకోమో ఫిలిబెక్ అనే నేత, యూరోపియన్ సోషలిస్టుల పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తరచూ ఉపయోగించే 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' నినాదాన్ని వినిపించారు. (వివరాలు 2లో..)

రాహుల్‌కు మద్దతు.. బీజేపీకి ఆగ్రహం

రాజకీయ వివాదంలో ఇటలీ నేత ఫిలిబెక్!

బీజేపీ ఆగ్రహానికి కారణమైన ఆ నేత ఎవరు?

హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్ 2026తో ఇటలీ రాజకీయ నేత జియాకోమో ఫిలిబెక్ పేరు ఒక్కసారిగా చర్చల్లోకి వచ్చింది. యూరోపియన్ సోషలిస్టుల పార్టీ (పీఈఎస్) ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన, భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు (2లో..).

కాంగ్రెస్ ఇన్‌ఛార్జీలు ఇన & ఔట్


• హైకమాండ్ అంతరంగంపై డౌట్ • అధికారం చేపట్టాక నాలుగో చేంజ్

•రేవంత్ సర్కారుకు న్యూకమాండ్



అధికారం చేతిలో ఉంది.. ముఖ్యమంత్రి పీఠం పదిలంగానే ఉంది.. అయినా తెలంగాణ కాంగ్రెస్‌లో ఇన్‌ఛార్జిల మార్పుల పర్వం ఎందుకు ఆగడం లేదు? ఎన్నికల విజయంతో మొదలైన ప్రస్థానం.. ఇప్పుడు అంతర్గత అసమ్మతులు, ఆధిపత్య పోరు, అధిష్ఠానం జోక్యం చుట్టూ తిరుగుతోందా? రెండున్నరేళ్లలో నలుగురు ఇన్‌ఛార్జిలు మారడం వెనుక అసలు కథేంటి? మాణిక్‌రావ్ ఠాక్రే నుంచి దీపాదాస్ మున్షీ, మీనాక్షి నటరాజన్ మీదుగా ఇప్పుడు బీఎం సందీప్ వరకు సాగిన ఈ మార్పుల పరంపర కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలకు అద్దం పడుతోంది. (వివరాలు 2లో..)

మావోయిస్టుల హింసకు ఆదివాసీలు బలి



ఓటు హక్కుకూ దూరం చేశారన్న ప్రధాని

మావోయిస్టుల హింస కారణంగా దేశంలో అత్యధికంగా నష్టపోయింది గిరిజన సమాజమేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కొన్ని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆదివాసీలను ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. గిరిజన పిల్లలను బలవంతంగా తీసుకెళ్లడం, యువతులను అపహరించడం వంటి ఘటనలు జరిగినా గత ప్రభుత్వాలు మౌనంగా ఉన్నాయని విమర్శించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా మహారాష్ట్రలోని గడ్చిరోలిలో నిర్వహించిన జనజాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. (వివరాలు 3లో..)



ఆకలేస్తే ఆర్డర్..

7లో..

అవసరమైతే ఆన్‌లైన్!

» ఇంటి గుమ్మం వద్దకు ప్రపంచ మార్కెట్..

» ఆన్‌లైన్ ఆర్డర్లతో మారిన వైనం!

» రాష్ట్రాల బడ్జెట్‌ను మించిన వ్యాపారమా..!?

ఆకలేస్తే ఆర్డర్.. సరుకులు కావాలంటే బుకింగ్.. స్వీట్స్ కావాలంటే ఒక్క క్లిక్! ఒకప్పుడు మార్కెట్‌కు వెళ్లిన మనిషి.. ఇప్పుడు మార్కెట్‌నే ఇంటికి రప్పిస్తున్నాడు. స్మార్ట్‌ఫోన్‌లో నొక్కిన ఒక్క బటన్ వెనుక వేల కోట్ల వ్యాపారం, లక్షలాది మంది ఉపాధి, లక్షలాది దుకాణాల భవిష్యత్తు దాగి ఉన్నాయి. స్విగ్గీ, జొమాటో, జెప్టో, బ్లింకిట్, బిగ్‌బాస్కెట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్.. ఇవి కేవలం ఆర్డర్లు తీసుకునే సంస్థలు కావు. ప్రపంచ వ్యాపార ముఖచిత్రాన్ని మార్చేస్తున్న డిజిటల్ సామ్రాజ్యాలు! వినియోగదారుడికి సౌకర్యం.. కంపెనీలకు కోట్ల ఆదాయం.. వ్యాపారులకు కొత్త మార్కెట్.. మరి ఈ వ్యవస్థను నడిపిస్తున్న డెలివరీ బాయ్ పరిస్థితి ఏమిటి? ఎండైనా, వానైనా రోడ్లపై పరుగులు తీస్తున్న అతడి జీవితానికి భరోసా ఉందా? తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ చట్టం అతడి బతుకులో ఎంతటి మార్పు తీసుకురానుంది? అవసరానికి ఆర్డర్ చేస్తున్నామా? ఆఫర్ల మాయలో అనవసరంగా ఖర్చు చేస్తున్నామా? ఒక ఆర్డర్ వెనుక ఎవరెవరి శ్రమ ఉంది? ఎవరి జేబులు నిండుతున్నాయి? ఎవరి బతుకులు మారుతున్నాయి? ఆర్డర్ బటన్ నొక్కితే మొదలయ్యే ఈ అద్భుత ప్రపంచం వెనుక అసలు కథ ఏమిటి?



6లో..

దోషులెవరు? రికార్డులెక్కడ?

ఆక్రమణదారులకు అండ ఎవరిది?

» వ్యవస్థల వెనుక అదృశ్య శక్తులెవరు?

» రుద్రారం పన్నుల లెక్కల్లో భారీ గోల్‌మాల్?

» రూ. 15.64 కోట్ల వసూళ్లు.. 11 ఏళ్లు నిల్..!

» ప్రజాధనానికి లెక్కలేవీ? అధికారుల బాధ్యత ఏదీ?

ఒక గ్రామ పంచాయతీ.. రూ. 15.64 కోట్ల ఆస్తి పన్నుల లెక్కలు.. వరుసగా పదకొండేళ్లు నాన్ రెసిడెన్షియల్ పన్నుల వసూళ్లు నిల్! ఇదేమైనా సాధారణ లెక్కల తప్పిదమా? లేక ప్రభుత్వ ఆదాయానికి గండిపడేలా సాగిన వ్యవహారమా? సంగారెడ్డి జిల్లా రుద్రారంలో వెలుగుచూసిన గణాంకాలు పాలక యంత్రాంగం పనితీరునే ప్రశ్నిస్తున్నాయి. 2009లో గీతం యూనివర్సిటీ కార్యకలాపాలు ప్రారంభించిన ప్రాంతం.. 1999లోనే విలీనమైన మైకే లాటిక్రీట్ వంటి సంస్థలతో పాటు అనేక పరిశ్రమలు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలున్న ప్రాంతం.. అలాంటి చోట పదకొండేళ్లపాటు వాణిజ్య ఆస్తుల పన్నుల వసూళ్లు నిల్‌గా ఎలా నమోదయ్యాయి? ఎవరు పన్నులు అంచనా వేయాలి? ఎవరు వసూలు చేయాలి? పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేశారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన వ్యవస్థకు ఫిర్యాదు అందినప్పుడు కనీసం దానిపై తీసుకున్న చర్యల నివేదిక కూడా లేదా? ఆర్టీఐ ద్వారా అడిగితే అసలు ఫిర్యాదు, ఇన్‌వార్డ్ రిజిస్టర్, అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలే అందుబాటులో లేవని సమాధానం! మరి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల ఫిర్యాదులకే భద్రత లేకపోతే ప్రజాధనానికి రక్షణ ఎక్కడ? పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేస్తే గత అక్రమాలపై బాధ్యత కూడా విలీనమైపోతుందా? వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నదెవరు? పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యానికి, రికార్డుల గల్లంతుకు బాధ్యులెవరు? ఇప్పుడు కావాల్సింది కంటితుడుపు ప్రకటనలు కాదు.. రికార్డుల స్వాధీనం, స్వతంత్ర విచారణ, బాధ్యుల గుర్తింపు, ప్రభుత్వ ఆదాయానికి పూర్తిస్థాయి లెక్క! రుద్రారం వ్యవహారం బయటపెడుతున్నది పన్నుల లెక్కల్లోని వ్యత్యాసాలనేనా? లేక ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన వ్యవస్థలోని లోపాలనూ?

ఎన్నాళ్లో ఫోన్ ట్యాపింగ్ డ్రామా?

- బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్
- కానీ కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తోంది
- హస్తం వైఫల్యాలపై బండి సంజయ్ ఫైర్!



వందలాది మందిని పిలిచి విచారిస్తున్నా ఇప్పటివరకు ఏం సాధించారని నిలదీశారు. సిట్ విచారణ టీవీ సీరియల్‌లా సాగుతోందని, కేసులు ఎప్పుడు నమోదు చేస్తారు? చార్జిషీట్లు ఎప్పుడు వేస్తారు? నిందితులను ఎప్పుడు అరెస్టు చేస్తారు? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయా?

బీజేపీ రాష్ట్రంలో బలపడుతుండటాన్ని తట్టుకోలేక కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. నితిన్ నబిన్ తెలంగాణ పర్యటనతో బీజేపీ కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగిందని, రామచంద్రరావు నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలు విజయవంతమయ్యాయని చెప్పారు. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉపఎన్నికల్లో కాంగ్రెస్ డిపాజిట్లు కోల్పోయిందని గుర్తుచేశారు. కరీంనగర్, వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ గతంలో ఒక్క స్థానం గెలవలేదని విమర్శించారు. ప్రజల మద్దతుతోనే బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌పై ఎదురుదాడి

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కరీంనగర్‌కు రూ.840 కోట్ల ప్రాజెక్టును తీసుకొచ్చిన ఘనత బీజేపీదేనని బండి సంజయ్ పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రం, బ్యాంకుల భాగస్వామ్యంతో నిధులు సమకూరే ఈ పథకంపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. కేంద్ర పథకాల ప్రయోజనాలను ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు. మరోవైపు వి.బి. జి. రామ్ పథకంపై రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలనూ ఆయన విమర్శించారు. మొత్తంగా ఫోన్ ట్యాపింగ్ విచారణ, అభివృద్ధి నిధులు, కేంద్ర పథకాల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ రాజకీయంగా బీజేపీ దూకుడు పెంచింది.

సజ్జనార్‌పై సమగ్ర విచారణ జరపాలి

పెండింగ్ కేసులపై అనుమానాలు

ఫోన్ ట్యాపింగ్, భూ కొనుగోళ్లపై ఆరా

సీబీఐ దర్యాప్తునకు రాజాసింగ్ లేఖ!



వీటిపై రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా విచారణ జరిపించాలని కోరారు. అవసరమైతే సీబీఐ దర్యాప్తు లేదా న్యాయ విచారణకు ఆదేశించాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. ఆరోపణల వెనుక వాస్తవాలను వెలికితీసి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.

బంగారం చోరీ, ఆమ్మే కేసులపై ప్రశ్నలు

సజ్జనార్ హయాంలో దర్యాప్తు జరిగిన బంగారం చోరీ కేసు, ఆమ్మే కేసుల పురోగతిపై రాజాసింగ్ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ కేసుల్లో ఆశించిన స్థాయిలో విచారణ ముందుకు సాగలేదని ఆరోపించారు. దర్యాప్తులో జాప్యానికి కారణాలేమిటి? కీలక వివరాలను బయటకు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు ఏమైనా జరిగాయా? అనే అంశాలను స్వతంత్ర సంస్థతో పరిశీలించాలని కోరారు. అలాగే తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు ఏదిశగా సాగిందో సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో సీనియర్ పోలీసు అధికారుల పాత్రపై వచ్చిన ఆరోపణలు, సజ్జనార్ బాధ్యతల్లో ఉన్న సమయంలో తీసుకున్న చర్యలను పరిశీలించాలని కోరారు.

వంద ఎకరాల భూముల కొనుగోళ్లపైనా ఆరా

మాజీ సీబీఐ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు గతంలో సజ్జనార్‌పై చేసినట్లు ప్రచారంలో ఉన్న తీవ్రమైన ఆరోపణలను కూడా రాజాసింగ్ తన వినతిపత్రంలో ప్రస్తావించారు. వీటిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. సజ్జనార్ స్వస్థలమైన కర్ణాటకలోని గ్రామం పరిసర ప్రాంతాల్లో దాదాపు 100 ఎకరాల భూములు కొనుగోలు చేసినట్లు వచ్చిన వార్తలపై కూడా పరిశీలన అవసరమని పేర్కొన్నారు. ఆస్తుల కొనుగోలుకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? ప్రకటించిన ఆదాయానికి ఆస్తుల విలువ సరిపోతుందా? అనే అంశాలను ధ్రువీకరించాలని కోరారు. అయితే ఇవన్నీ విచారణ ద్వారా నిర్ధారించాల్సిన ఆరోపణలుగానే ఉన్నాయి. పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరగాలంటే పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని రాజాసింగ్ తన డిమాండ్‌లో స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌దే ప్రజాస్వామ్య ఉల్లంఘన చరిత్ర!

- రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- భారత్ సమ్మిట్‌పై రాంచందర్‌రావు విమర్శలు



విదేశీ ప్రతినిధులు భారత ప్రజాస్వామ్యంపై చేసిన వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ బాధ్యత వహించి దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న వారిపై తగిన వేదికల్లో ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనలో ఎమర్జెన్సీ విధించడం, ప్రతిపక్ష నేతలను నిర్బంధించడం, న్యాయవ్యవస్థపై ప్రభావం చూపడం వంటి పరిణామాలను గుర్తుచేస్తూ విమర్శలు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన అన్ని విభాగాల సమావేశంలో రాంచందర్‌రావు ప్రసంగించారు. పార్టీ బలోపేతానికి ఎక్స్ సర్వీస్‌మెన్, న్యాయవాదులు, వ్యాపారులు, ఐటీ నిపుణులు, ఉపాధ్యాయులు, వైద్యులు, సాంస్కృతిక విభాగాలు కీలకమని చెప్పారు. వివిధ వృత్తుల వారిని పార్టీలోకి అనుసంధానించాలని సూచించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్ల నమోదు వేగవంతం చేయాలని, బూత్ స్థాయి నుంచి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజల్లో జాతీయవాద భావజాలం, సామాజిక చైతన్యం పెంపొందించాలని పిలుపునిచ్చారు. భారత్ సమ్మిట్‌కు 350 మంది విదేశీ ప్రతినిధులు రావాల్సి ఉండగా 115 మందే హాజరయ్యారని పేర్కొన్నారు. వీసాల రద్దును సమర్థిస్తూ, విదేశీ జోక్యంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

రాహుల్ వెంట పరుగులేంటి?

- ఆత్మగౌరవమే రాష్ట్ర ఆవిర్భావ లక్ష్యం
- కాంగ్రెస్, బీజేపీ నేతల కేటీఆర్ ఫైర్

అమిత్ షా వ్యవహారంపైనా విమర్శలు



బీజేపీ నేతల తీరుపైనా కేటీఆర్ తన పోస్టులో అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పులు మోస్తున్నారని, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఆయన పాదాలకు నమస్కరిస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలను ప్రస్తావిస్తూ తెలంగాణ నేతల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ నేతల ప్రవర్తన తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నది కేటీఆర్ ప్రధాన వాదన. రాష్ట్రం ఏర్పడిన ప్రాథమిక లక్ష్యమే ఆత్మగౌరవమని గుర్తుచేస్తూ, జాతీయ పార్టీల నాయకత్వాలు ఆ విలువను అర్థం చేసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఈ రెండు పార్టీల నేతల తీరుపై తన అసంతృప్తిని సోషల్ మీడియా వేదికగా వ్యక్తం చేశారు.

విదేశీ నేత నోట 'ఓట్ చోర్' నినాదం

- ఇటలీ నేత వ్యాఖ్యలతో రాజకీయ దుమారం
- రాహుల్ నవ్వుపై బీజేపీ నేతల విమర్శలు

హైదరాబాద్‌లో శనివారం జరిగిన భారత్ సమ్మిట్ వేదికగా రాజకీయ వివాదం చెలరేగింది. ఇటలీకి చెందిన జియాకోమో ఫిలిబెక్ అనే నేత, యూరోపియన్ సోషలిస్టుల పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తరచూ ఉపయోగించే 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' నినాదాన్ని వినిపించారు. అంతేకాకుండా దాని అర్థాన్ని 'ఓట్ల దొంగలారా.. పదవి నుంచి దిగిపోండి' అంటూ ఆంగ్లంలో వివరించారు. ఈ సమయంలో రాహుల్ గాంధీ నవ్వుతూ కనిపించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల సంఘం కుమ్మక్కై ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్నాయన్నది రాహుల్ ప్రధాన ఆరోపణను ఆయన హైలెట్ చేయడం ఇప్పుడు వివాదానికి కారణమవుతోంది.

విదేశీయులతో దేశ రాజకీయాలపై విమర్శలా?

ఈ ఘటనపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. విదేశీయులు భారత్‌ను అవమానిస్తున్నప్పుడు కొందరు భారతీయులు నవ్వడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చెందడంతో కాంగ్రెస్ నిరాశతో వ్యవహరిస్తోందన్నారు. విదేశీ ప్రతినిధులను ఆహ్వానించి, అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. తెలంగాణ బీజేపీ నేత బండి సంజయ్ ఈ సమావేశాన్ని 'యాంటీ భారత్ సమ్మిట్'గా అభివర్ణించారు. విదేశీ రాజకీయ నేతలకు దేశ అంతర్గత వ్యవహారాలపై మాట్లాడే అవకాశం కల్పించారని విమర్శించారు.

కాంగ్రెస్ ఎదురుదాడి.. మోదీ పర్యటన ప్రస్తావన

బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు తిప్పికొట్టారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మోదీ ప్రభుత్వం కాంగ్రెస్‌ను ప్రశ్నించే హక్కు లేదని ఎంపీ ప్రమోద్ తివారీ వ్యాఖ్యానించారు. విదేశీ నేత కూడా ఇలాంటి నినాదం చేస్తే పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి గిరిజా శెత్కర్ మరో అంశాన్ని ప్రస్తావించారు. 2019లో అమెరికాలో జరిగిన 'హౌడీ మోదీ' కార్యక్రమంలో 'అబ్‌కీ బార్ ట్రంప్ సర్కార్' నినాదం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ కూడా ఇటలీ నేతల ప్రస్తావనతో మోదీపై విమర్శలు చేశారు.

ఎస్ఐఆర్‌పై విమర్శలు.. రాహుల్ ఆరోపణలు

భారత్ సమ్మిట్‌లో ఫిలిబెక్ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలను ప్రశంసించారు. ఓటర్ల జాబితాల నుంచి లక్షలాది పేర్లు తొలగించడంపై యువత, విద్యార్థులు, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పోరాటంలో కాంగ్రెస్, రాహుల్ గాంధీ నాయకత్వం కీలకమని వ్యాఖ్యానించారు. మరోవైపు, సమ్మిట్‌కు హాజరుకావాల్సిన పలువురు విదేశీ ప్రతినిధులకు వీసాలు ఉన్నప్పటికీ భారత ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని రాహుల్ ఆరోపించారు. వారికి క్షమాపణలు చెబుతున్నట్లు ప్రసంగంలో పేర్కొన్నారు. అనంతరం ఓట్ల చోరీ ఆరోపణలను మరోసారి ప్రస్తావించారు. విదేశీ నేత వ్యాఖ్యలు, రాహుల్ స్పందన, బీజేపీ ఎదురుదాడితో హైదరాబాద్ సమ్మిట్ జాతీయ రాజకీయాల్లో కొత్త వివాదానికి కేంద్రంగా మారింది.

కాంగ్రెస్ ఇన్‌ఛార్జీలు ఇన్ & ఔట్

హైకమాండ్ అంతరంగంపై డౌట్

- అధికారం చేపట్టాక నాలుగో చేంజ్
- రేవంత్ సర్కారుకు న్యూకమాండ్



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర పార్టీ వ్యవహారాల్లో వరుస మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా నవంబర్ 14న పార్టీ అధిష్ఠానం తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌ఛార్జిగా బీఎం సందీప్‌ను నియమించింది. మీనాక్షి నటరాజన్‌ను తక్షణమే ఆ బాధ్యతల నుంచి తప్పించింది. 2023 జనవరి నుంచి చూస్తే తెలంగాణకు ఇది నాలుగో ఇన్‌ఛార్జి మార్పు. మొదట మాణిక్‌రావ్ ఠాక్రే బాధ్యతలు చేపట్టారు. ఆయన పర్యవేక్షణలోనే కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత దీపాదాస్ మున్షీ, 2025 ఫిబ్రవరిలో మీనాక్షి నటరాజన్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు సందీప్ నియామకంతో మరోసారి పార్టీ వ్యవహారాలపై చర్చ మొదలైంది.

ప్రభుత్వానికి, పార్టీ నాయకత్వానికి మధ్య విభేదాలా?

మీనాక్షి నటరాజన్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం, పార్టీ సంస్థాగత నాయకత్వం, ఢిల్లీ అధిష్ఠానం మధ్య కొన్ని అంశాల్లో అభిప్రాయభేదాలు బయటపడ్డాయి. ముఖ్యంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని కంచ గచ్చిబౌలి భూముల వివాదం కీలకంగా మారింది. యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళనలకు ఆమె మద్దతు తెలిపినట్లు వార్తలు రావడంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఖరితో విభేదాలు తలెత్తాయి. మరోవైపు జిల్లా స్థాయి పార్టీ నియామకాలు, బీఆర్ఎస్ నుంచి వచ్చే నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాల్లోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ వర్గం రాజకీయంగా ప్రభావం ఉన్న కొత్త నేతలను చేర్చుకోవాలని భావిస్తే, నటరాజన్ పాత కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయంతో ఉన్నట్లు సమాచారం.

సందీప్ నియామకం వెనుక హైకమాండ్ వ్యూహం?

మీనాక్షి నటరాజన్‌కు 2026 జూన్‌లో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారైనా, తెలంగాణకు సంబంధించిన పెండింగ్ కోర్టు వ్యవహారాన్ని అఫిడవిట్‌లో వెల్లడించలేదన్న కారణంతో ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైంది. హైదరాబాద్ నుంచి సమాచారం లీక్ కావడం వల్లే కాంగ్రెస్ ఒక రాజ్యసభ స్థానాన్ని కోల్పోయిందన్న ఆరోపణలు కూడా అప్పట్లో వచ్చాయి. ప్రస్తుతం ఆమె బ్రిటన్ పర్యటనలో ఉన్నారు. తాజాగా బాధ్యతలు చేపట్టిన బీఎం సందీప్ గతంలో మహారాష్ట్ర, గుజరాత్‌లో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించారు. ఎనిమిదేళ్లపాటు కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేశారు. రాహుల్ గాంధీకి సన్నిహితంగా ఉండటం ఆయన నియామకంలో ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఆయనకు పెద్దగా ప్రజాబలం ఉన్న నాయకుడిగా కాకుండా సంస్థాగత వ్యవహారాల్లో అనుభవం ఉన్న నేతగా గుర్తింపు ఉంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంతో సమన్వయం, పాత కాంగ్రెస్ నేతల ఆకాంక్షలు, అధిష్ఠానం అంచనాల మధ్య సమతుల్యత సాధించడం ఆయన ముందున్న ప్రధాన బాధ్యత. 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ నియామకం తెలంగాణ కాంగ్రెస్‌లో ఎలాంటి మార్పులు తీసుకొస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

క్రీడా చరిత్రలో సంచలనం

- ఖేలో ఇండియా కొత్త అధ్యాయం
- యువ క్రీడాకారులకు భారీ వేదిక
- క్రీడా సంబరాలకు సర్వం సిద్ధం



తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న ఎనిమిదో ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 రాష్ట్ర క్రీడా చరిత్రలో కీలక మైలురాయిగా నిలవనున్నాయి. ఈ పోటీలకు సంబంధించిన లోగో, మస్కట్‌ను కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ పోటీల నిర్వహణకు తెలంగాణను ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని క్రీడా ప్రారంభోత్సవానికి ఆహ్వానించామని, ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

రూ.203 కోట్లతో శాశ్వత సదుపాయాలు

కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.21 కోట్లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.203.13 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించిందని మంత్రి తెలిపారు. ఈ నిధులను పోటీల నిర్వహణకే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని స్టేడియాల్లో శాశ్వత క్రీడా మౌలిక వసతుల కల్పనకు వినియోగిస్తామని స్పష్టం చేశారు. దీంతో భవిష్యత్తులో క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సాధన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈసారి మొత్తం 27 క్రీడాంశాల్లో పోటీలు జరగనుండగా, తెలంగాణ సంప్రదాయ క్రీడ కర్రసామును కూడా చేర్చడం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దేశవ్యాప్తంగా 7 వేల మందికి పైగా క్రీడాకారులు, సుమారు 1,200 మంది కోచ్‌లు, సహాయక సిబ్బంది పాల్గొననున్నారు. హైదరాబాద్‌తో పాటు హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మత్తుకు దూరంగా.. మైదానాల వైపు యువత

యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి క్రీడలు, వ్యాయామం వైపు మళ్లించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వాకిటి శ్రీహరి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు "మత్తు వదలండి.. మైదానాలు చేరండి" అనే నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నామని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన నశా ముక్త్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఖేలో ఇండియా పోటీల ద్వారా తెలంగాణ క్రీడా ప్రతిభను జాతీయ స్థాయిలో చాటడంతో పాటు, రాష్ట్రాన్ని క్రీడారంగంలో అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

రాహులకు మద్దతు.. బీజేపీకి ఆగ్రహం

- రాజకీయ వివాదంలో ఇటలీ నేత ఫిలిబెక్!
- బీజేపీ ఆగ్రహానికి కారణమైన ఆ నేత ఎవరు?



హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్ 2026తో ఇటలీ రాజకీయ నేత జియాకోమో ఫిలిబెక్ పేరు ఒక్కసారిగా చర్చల్లోకి వచ్చింది. యూరోపియన్ సోషలిస్టుల పార్టీ (పీఈఎస్) ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన, భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా సామాజిక న్యాయం, వాతావరణ న్యాయం, మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువల కోసం పనిచేసే ప్రగతిశీల శక్తులన్నీ కలిసిరావాలని అన్నారు. 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' నినాదాన్నికూడా వినిపించారు. దీంతో బీజేపీ తీవ్రంగా స్పందించింది. భారత అంతర్గత రాజకీయాల్లో విదేశీ నేతల జోక్యాన్ని కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందని ఆరోపించింది.

యువజన రాజకీయాల నుంచి అంతర్జాతీయ స్థాయికి

1978లో ఇటలీలో జన్మించిన జియాకోమో ఫిలిబెక్ యూరప్‌కు చెందిన సామ్యవాద రాజకీయ నాయకుడు. విద్యార్థి దశలోనే యువజన సంస్థల ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. 2002 నుంచి 2004 వరకు యూరోపియన్ యూత్ ఫోరమ్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2005 నుంచి 2009 వరకు యంగ్ యూరోపియన్ సోషలిస్ట్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ఇటలీకి చెందిన సెంటర్ లెఫ్ట్ పార్టీ డెమోక్రటిక్ పార్టీలో చేరారు. 2010లో ఆ పార్టీ అంతర్జాతీయ విభాగంలో బాధ్యతలు చేపట్టారు. 2013లో విదేశాంగ విధాన వేదికకు అధ్యక్షుడిగా నియమితులయ్యారు. యువజన ఉద్యమాల నుంచి అంతర్జాతీయ రాజకీయ వేదిక వరకు ఆయన తన ప్రస్థానాన్ని కొనసాగించారు.

ఇటలీ ప్రభుత్వంలోనూ కీలక బాధ్యతలు

2014లో ఇటలీ వ్యవసాయ మంత్రిత్వ శాఖలో అంతర్జాతీయ సంబంధాల విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టారు. 2014 నుంచి 2015 వరకు ఆ శాఖ అంతర్జాతీయ సంబంధాల కార్యాలయ డైరెక్టర్‌గా పనిచేశారు. ఇటలీ జాతీయ వృత్తిపరమైన జర్నలిస్టుల సంఘంలోనూ ఆయన సభ్యుడిగా ఉన్నారు. రాజకీయ శాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీతో పాటు, మాస్టర్స్ డిగ్రీ పొందారు. 2023 నుంచి యూరోపియన్ సోషలిస్టుల పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. భారత్ సమ్మిట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ ఘర్షణకు కారణమయ్యాయి. భారత ప్రజాస్వామ్యంపై విమర్శలు, రాహుల్‌కు బహిరంగ మద్దతు ఆయనను తాజా రాజకీయ వివాదంలో కేంద్రబిందువుగా నిలిపాయి.





హరీశ్‌రావు నివాసానికి మాజీ సీఎం కేసీఆర్ రాక

సత్యనారాయణరావు సంవత్సరీక కార్యక్రమానికి హాజరు

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు నివాసానికి చేరుకున్నారు. హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు చిత్రపటానికి కేసీఆర్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి కార్యక్రమంలో పాల్గొన్నారు.

హరీశ్‌రావు కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కుమారుడు హిమాన్షు.. హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు సంవత్సరీక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, సత్యనారాయణరావుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తండ్రి, కొడుకులపై అందరి దృష్టి పడింది.



బ్రిటన్ పౌరుడిగా మారిన లలిత్ మోదీ

- ఆక్స్‌ఫర్డ్ వేదికగా కొత్త జీవిత అధ్యాయం
- ఇక లండన్ సొంతిల్లుగా అంటూ ప్రకటన

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వ్యవస్థాపకుడు లలిత్ మోదీ బ్రిటన్ పౌరసత్వం పొందారు. గత కొన్నేళ్లుగా లండన్‌లో నివసిస్తున్న ఆయన, ఇప్పుడు అధికారికంగా బ్రిటిష్ పౌరుడిగా మారిన విషయాన్ని వెల్లడించారు. నవంబర్ 14న ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌లో ప్రసంగించిన సందర్భంగా తన జీవితంలో జరిగిన ఈ ప్రత్యేక పరిణామాన్ని బహిరంగంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 15న లండన్‌లోని టౌన్‌హాల్‌లో జరిగిన పౌరసత్వ వేడుకకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో బ్రిటిష్ పౌరసత్వం స్వీకరించడం తన జీవితంలో మరిచిపోలేని సందర్భమని పేర్కొన్నారు. బ్రిటన్‌ను ఎన్నో ఏళ్లుగా తన నివాసంగా భావిస్తున్నానని, ఆ దేశ పౌరుడిగా మారడం గర్వంగా ఉందని లలిత్ మోదీ వెల్లడించారు.

భారత్‌ను వీడి లండన్‌లో నివాసం

ఐపీఎల్‌లో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో బీసీసీఐ 2010 మేలో లలిత్ మోదీని సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఆయన భారత్‌ను విడిచి పెట్టి లండన్‌లో నివసిస్తున్నారు. ఐపీఎల్ వ్యవహారాలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జారీ చేసిన సమన్లకు స్పందించకపోవడంతో 2015లో ప్రత్యేక కోర్టు ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మరోవైపు, 2009లో దక్షిణాఫ్రికాలో జరిగిన ఐపీఎల్ సీజన్‌కు సంబంధించిన ప్రత్యేక ఫెమా కేసులో తనపై విధించిన జరిమానాను ఈ ఏడాది జూలైలో అప్పీలేట్ ట్రిబ్యునల్ రద్దు చేసింది. తనను పరారీలో ఉన్న వ్యక్తిగా పేర్కొనడాన్ని లలిత్ మోదీ వ్యతిరేకిస్తున్నారు. తాను ఎలాంటి నేరంలోనూ దోషిగా నిర్ధారణ కాలేదని గతంలో స్పష్టం చేశారు.

బ్రిటన్ విలువలపై ప్రశంసలు

బ్రిటన్ ప్రజలు, అక్కడి సంస్థలు, సంప్రదాయాలు, విలువలంటే తనకు ఎంతో గౌరవమని లలిత్ మోదీ పేర్కొన్నారు. బ్రిటిష్ పౌరసత్వం పొందడం ఒక ప్రత్యేక హక్కుతో పాటు బాధ్యత కూడా అని వ్యాఖ్యానించారు. తన జీవిత ప్రయాణంలో వివిధ దేశాల సంస్కృతులు, అనుభవాలు కీలక పాత్ర పోషించాయని తెలిపారు. ఇకపై తాను గర్వంగా సొంత దేశంగా భావిస్తున్న బ్రిటన్‌కు సానుకూలంగా సేవలు అందించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. తన కుటుంబ సభ్యులు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ 14న బ్రిటన్ రాజు చార్లెస్ 3 జన్మదినం సందర్భంగా ఈ విషయాన్ని ప్రకటించడం మరింత ప్రత్యేకమని పేర్కొన్నారు. 'గాడ్ సేవ్ ది కింగ్' అంటూ తన సందేశాన్ని ముగించారు. దీంతో ఐపీఎల్ వ్యవస్థాపకుడి బ్రిటిష్ పౌరసత్వ ప్రకటన క్రికెట్, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.



నల్లగొండలో రైతాంగ హక్కుల మహాగర్జన!

- నాలుగు కిలోమీటర్ల మేర ఎర్రజెండాల కవాతు

తెలంగాణ రైతాంగ పోరాటాల గడ్డ నల్లగొండలో ఎర్రజెండాలు రెపరెపలాడాయి. అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల సందర్భంగా నిర్వహించిన రైతాంగ ప్రదర్శనలో వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. మర్రిగూడ బైపాస్ నుంచి ఎన్జీ కళాశాల వరకు నాలుగు కిలోమీటర్ల మేర రెండు గంటలకు పైగా ప్రదర్శన సాగింది. ఆదివాసీ దింసా నృత్యాలు, మహిళల కోలాటాలు, చెక్కభజనలు, దప్పుల దరువులు, ఎడ్లబండ్ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్పొరేట్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బహిరంగ సభలో బృందా కారత్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన లౌకిక పోరాటమని గుర్తుచేశారు. దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, సుందరయ్య, మల్లు స్వరాజ్యం వంటి యోధుల త్యాగాలను స్మరించి నాలుగు వేల మంది అమరవీరులకు నివాళులర్పించారు.

రైతులు, మహిళలు, ఆదివాసీల హక్కుల కోసం పోరు

రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర కల్పించాలని, రైతు ఆత్మహత్యలను అరికట్టాలని బృందా కారత్ డిమాండ్ చేశారు. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం రైతులకు నష్టం కలిగించే ప్రమాదముందని హెచ్చరించారు. వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళలకు రైతులుగా గుర్తింపు, భూమిపై హక్కులు కల్పించాలని కోరారు. భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని సూచించారు. పంట నష్టపరిహారం పూర్తిగా అందించాలని, విద్యుత్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల అటవీ హక్కులను కాపాడి పోడు భూములకు పట్టాలివ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని, గ్రామ సభల అధికారాలను గౌరవించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రైతులు, కార్మికులు, మహిళలు, ఆదివాసీలు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

ఐక్య ప్రభుత్వానికి నెతన్యాహు పిలుపు



- ప్రతిపాదనకు వ్యతిరేకించిన ఐసెన్‌కోట్

ఇజ్రాయెల్‌లో ప్రభుత్వ ఏర్పాటుపై రాజకీయ ఉత్కంఠ నెలకొంది. ఆపద్ధర్మ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు జాతీయ ఐక్య ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రత్యర్థి గాడి ఐసెన్‌కోట్‌ను కోరారు. ఇరాన్ ముప్పును ఎదుర్కొనేందుకు దేశ భద్రత కోసం ప్రధాన రాజకీయ పార్టీలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. అయితే ఈ ప్రతిపాదనను ఐసెన్‌కోట్ రాజకీయ ఎత్తుగడగా అభివర్ణించారు. ఎన్నికల్లో ఎదురైన ఓటమి నుంచి బయటపడేందుకు నెతన్యాహు ఐక్యత పేరుతో ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఐసెన్‌కోట్‌కు 28 రోజుల గడువు ఇచ్చారు. అవసరమైతే మరో 14 రోజులు పొడిగించవచ్చు. ఆయన కూటమికి 48 మంది ఎంపీల మద్దతుండగా, నెతన్యాహు వర్గానికి 46 మంది ఉన్నారు. మరో 26 మంది అరబ్, అల్ట్రా ఆర్థడాక్స్ సభ్యుల వైఖరి కీలకంగా మారింది.

అతివాద నేతలపై ఐసెన్‌కోట్ షరతు

ప్రభుత్వ ఏర్పాటుకు అతివాద నేతలతో సంబంధాలు తెంచుకోవాలని ఐసెన్‌కోట్ షరతు విధించారు. ముఖ్యంగా మంత్రి ఇటమార్ బెన్ గ్విర్ మద్దతుదారులకు దూరంగా ఉండాలని కోరారు. లికుడ్ నేతలు నిజాయితీగా ఐక్యతకు సిద్ధమైతే వారితో కలిసి పనిచేసేందుకు సిద్ధమని సంకేతాలిచ్చారు. మరోవైపు అరబ్ పార్టీలకు వచ్చిన స్థానాలు కూడా ప్రభుత్వ ఏర్పాటులో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మంగళవారం జరగనున్న పార్లమెంట్ స్పీకర్ ఎన్నిక మరో కీలక పరిణామంగా మారింది. ప్రస్తుత స్పీకర్ అమీర్ ఒహానా స్థానంలో మతన్ కహానాకు మద్దతివ్వాలని ఐసెన్‌కోట్ డిమాండ్ చేశారు. ఐక్య ప్రభుత్వ ప్రతిపాదన, ఎంపీల మద్దతు, అతివాద నేతల అంశాలే ఇజ్రాయెల్ తదుపరి రాజకీయ పరిణామాలను నిర్ణయించనున్నాయి.

మావోయిస్టుల హింసకు ఆదివాసీలు బలి

- ఓటు హక్కుకూ దూరం చేశారన్న ప్రధాని మోదీ

మావోయిస్టుల హింస కారణంగా దేశంలో అత్యధికంగా నష్టపోయింది గిరిజన సమాజమేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కొన్ని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆదివాసీలను ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. గిరిజన పిల్లలను బలవంతంగా తీసుకెళ్లడం, యువతులను అపహరించడం వంటి ఘటనలు జరిగినా గత ప్రభుత్వాలు మౌనంగా ఉన్నాయని విమర్శించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా మహారాష్ట్రలోని గడ్చిరోలిలో నిర్వహించిన జనజాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. మావోయిస్టు హింస తగ్గడంతో గిరిజన ప్రాంతాల్లో భద్రత మెరుగుపడిందని, పిల్లలకు విద్య, ఉపాధి అవకాశాలు అందుతున్నాయని పేర్కొన్నారు.

గిరిజన సంక్షేమానికి లక్ష కోట్లకు పైగా నిధులు

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మోదీ తెలిపారు. పీఎం జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకాలకు రూ.లక్ష కోట్లకు పైగా కేటాయించినట్లు వెల్లడించారు. గత 12 నుంచి 13 ఏళ్లలో దాదాపు 50 కోట్ల మంది తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని ప్రపంచ బ్యాంకు నివేదికను ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా పేదలకు నాలుగు కోట్లకు పైగా పక్కా ఇళ్లు నిర్మించామని, 18 వేల గ్రామాలకు విద్యుత్ అందించామని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం, 1.75 లక్షలకు పైగా ఆరోగ్య మందిరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ముద్ర రుణాలు, ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు పెంచుతున్నామని వివరించారు.

రూ.30 వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా రూ.30 వేల కోట్ల విలువైన గిరిజన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. 170కి పైగా ప్రాజెక్టులను ప్రారంభించగా, మరో 70కి పైగా పనులకు శంకుస్థాపనలు చేశారు. వీటిలో విద్యాసంస్థలు, ఆసుపత్రులు, గిరిజన ఉత్పత్తుల మార్కెటింగ్ కేంద్రాలు, గ్రామీణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఉన్నాయి. వ్యవసాయంలో వెనుకబడిన 100 జిల్లాలకు పీఎం ధన్‌ధాన్య కృషి యోజన ద్వారా ప్రోత్సాహం అందిస్తామని మోదీ తెలిపారు. అల్లూరి సీతారామరాజు, రాణి దుర్గావతి, సిద్ధూకాన్హూ వంటి గిరిజన పోరాటయోధుల త్యాగాలను గుర్తుచేశారు. గిరిజన మహిళ ద్రౌపది ముర్ము రాష్ట్రపతిగా ఉండటం దేశానికి గర్వకారణమన్నారు. బిర్సా ముండా స్ఫూర్తితో వికసిత భారత్ నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



తుమ్మిడిహెట్టికై మహారాష్ట్రను ఒప్పించండి

- ప్రాజెక్టులకు అనుమతులిప్పించాలన్న సీఎం
- ఎల్‌నినో కరవు సాయం ఇవ్వాలని విజ్ఞప్తి
- మోదీ చొరవ కీలకమన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఆదివారం ప్రధానమంత్రి అధికారిక నివాసంలో జరిగిన సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను వివరించారు. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మసాగర్, డిండి ప్రాజెక్టులకు పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో ఆశించిన ప్రయోజనాలు అందడం లేదని సీఎం వివరించారు. సుప్రీంకోర్టు సానుకూల తీర్పు నేపథ్యంలో అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తో సమన్వయానికి విజ్ఞప్తి

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును +152 మీటర్ల వద్ద నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని మోదీని రేవంత్‌రెడ్డి కోరారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో వెనుకబడిన, గిరిజన ప్రాంతాలకు గ్రావిటీ ద్వారా సాగు, తాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. మరోవైపు సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) త్వరగా వచ్చేలా సహకరించాలని కోరారు. ఇందుకోసం అవసరమైన సర్వేకు రూ.9.88 కోట్లు చెల్లించినట్లు వివరించారు.



నిధుల కేటాయింపుపై కేంద్రానికి ప్రతిపాదనలు

పూర్తికావస్తున్న ప్రాజెక్టుల కోసం సాస్కీ పథకం కింద అదనంగా రూ.5,000 కోట్లు మంజూరు చేయాలని సీఎం కోరారు. అలాగే 2027-28 ఆర్థిక సంవత్సరంలో నాలుగు సాగునీటి పథకాలకు రూ.5,856 కోట్ల కేంద్ర నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. భూగర్భ జలాల పెంపు, పరిరక్షణకు మరో రూ.5,000 కోట్ల ప్రత్యేక సాయం కోరినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. సమావేశంలో ప్రధాని సానుకూలంగా స్పందించి విజ్ఞప్తులను పరిశీలిస్తామని తెలిపినట్లు ఆయన చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ నుంచి ప్రస్తుతం నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని నిపుణులు సూచించినట్లు వివరించారు. తాగునీటి అవసరాల కోసం రిజర్వాయర్లలో నీటిని నిల్వ ఉంచామని, ఈ యాసంగిలో పరి సాగు చేయవద్దని రైతులకు సూచించినట్లు మంత్రి తెలిపారు.

ఎల్‌నినో కరవుపై కేంద్రానికి సీఎం నివేదిక

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతులు సమర్పించారు. వ్యవసాయ రంగానికి అవసరమైన 1,500 మెగావాట్ల అదనపు విద్యుత్, సరిపడా ఎరువులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వీబీజీ రాంజీ పథకం కింద అదనంగా 50 రోజుల ఉపాధి కల్పించాలని, రాష్ట్ర రుణ పరిమితిని ప్రస్తుతం ఉన్న 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 ప్రారంభోత్సవానికి హాజరుకావాలని ప్రధాని మోదీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

జనసేన నేతల పేరుతో ఉద్యోగాల మోసం

గుంటూరు జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ధరణి అనే మహిళను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. జనసేన పార్టీ నాయకులతో పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ నిరుద్యోగులకు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశ చూపినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో ధరణితో పాటు మరో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను లక్ష్యంగా చేసుకుని ఈ మోసాలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? ఎంతమంది బాధితులు మోసపోయారు? వసూలు చేసిన సొమ్ము ఎంత? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగే వ్యక్తుల పట్ల నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



22 ఏళ్లకే సర్పంచ్ బరిలో శివసాహితీ!



కడప జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. పోరుమామిళ్ల మండలం టేకూరుపేట గ్రామ సర్పంచ్ పదవికి కేవలం 22 ఏళ్ల వయసులోనే యువతి శివసాహితీ పోటీకి సిద్ధమయ్యారు. చిన్న వయసులోనే ప్రజా జీవితంలోకి అడుగుపెడుతూ గ్రామ నాయకత్వ బాధ్యతలు చేపట్టాలనే లక్ష్యంతో ఆమె ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. యువత రాజకీయాల్లోకి రావాలనే సంకల్పంతో శివసాహితీ తీసుకున్న నిర్ణయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామస్థాయి రాజకీయాల్లో యువతకు ప్రాతినిధ్యం పెరగాలనే అభిప్రాయానికి ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

లడఖ్‌లో జలవిప్లవం

ఒకవైపు మంచుకొండలు.. మరోవైపు ఎండిపోతున్న నీటి వనరులు! ప్రకృతి అందాలకు నిలయమైన లడఖ్‌లో ఇప్పుడు నీటి కొరత ప్రజల జీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. చలికాలంలో మంచు కురిసినా, వేసవిలో వ్యవసాయానికి అవసరమైన నీరు అందక గ్రామాలు అల్లాడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నీటి కోసం ప్రజలు సొంత ఊళ్లను వదిలి వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్రపాలిత ప్రాంత పాలన యంత్రాంగం 'ప్రాజెక్ట్ అమృత్ సరోవర్'ను వేగవంతం చేసింది. ఇప్పటికే నిర్మించిన నీటి కుంటలకు అదనంగా మరో 97 జలాశయాలకు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆమోదం తెలిపారు. వచ్చే జనవరి నాటికి 163 నీటి కుంటలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం. వీటి ద్వారా దాదాపు 55 కోట్ల లీటర్ల నీటిని నిల్వ చేయనున్నారు. ఇది కేవలం నీటి నిల్వల ప్రాజెక్టు మాత్రమే కాదు.. కరిగిపోతున్న హిమనీనదాలు, తగ్గుతున్న మంచు కురుపులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతల మధ్య లడఖ్ భవిష్యత్తును కాపాడే ప్రయత్నం. అసలు ఈ ప్రాజెక్టు ఏమిటి? దీని వల్ల గ్రామాలకు కలిగే ప్రయోజనాలేమిటి?

అసలేంటి అమృత్ సరోవర్ ప్రాజెక్టు?

లడఖ్‌లో వర్షపాతం తక్కువ. వ్యవసాయానికి ప్రధానంగా మంచు కరిగి వచ్చే నీరు, స్థానిక జలవనరులే ఆధారం. అయితే వాతావరణ మార్పుల కారణంగా మంచు కురిసే పరిమాణం తగ్గడం, హిమనీనదాలు క్రమంగా కరిగిపోవడం, భూగర్భ జలమట్టాలు పడిపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వర్షపు నీటిని, మంచు కరిగి వచ్చే నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకునేందుకు అమృత్ సరోవర్ ప్రాజెక్టు రూపొందించారు. లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆలోచనతో ఏప్రిల్ 10న ఈ కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామాల సమీపంలో శాస్త్రీయ పద్ధతులతో నీటి కుంటలు నిర్మించి, అవసరమైన సమయంలో వ్యవసాయానికి నీటిని అందించడం దీని ప్రధాన ఉద్దేశం.



97 కొత్త కుంటలు.. 55 కోట్ల లీటర్ల నిల్వ

ఈ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే 60 నీటి కుంటలను ఏడు నెలల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిలో 40 కుంటలను అక్టోబర్ 15న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. మరో ఆరు కుంటల నిర్మాణాన్ని డిసెంబర్ 15లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తాజాగా లెఫ్టినెంట్ గవర్నర్ మరో 97 కుంటలకు ఆమోదం తెలిపారు. వీటిని 2027 జనవరి 31లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మొత్తం 163 నీటి కుంటలు అందుబాటులోకి రానున్నాయి. లడఖ్‌లోని 248 గ్రామాల్లో 163 గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం కలగనుంది. అన్ని కుంటలు కలిపి దాదాపు 550 మిలియన్ లీటర్లు అంటే 55 కోట్ల లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం కలిగి ఉంటాయి. మార్చిలో ప్రారంభమయ్యే తదుపరి విత్తనాల సీజన్‌కు ముందే నీటి నిల్వలు సిద్ధం చేయడం లక్ష్యం.

నీటి కోసం ఊళ్లు వదిలే పరిస్థితికి పరిష్కారం

లడఖ్‌లోని కనీసం 50 నుంచి 60 గ్రామాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా కార్గిల్ ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో తాగునీరు, వ్యవసాయ నీరు అందక ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్యను తగ్గించడంలో అమృత్ సరోవర్ కీలక పాత్ర పోషించనుంది. గ్రామాల దగ్గరే నీటిని నిల్వ చేయడం వల్ల రైతులు దూర ప్రాంతాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. పంటలకు సమయానికి నీరు అందడంతో వ్యవసాయం కొనసాగించేందుకు అవకాశం ఏర్పడుతుంది. స్థానిక ప్రజలకు జీవనోపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఈ నిర్మాణాల్లో గ్రామస్థులు, గ్రామ పెద్దలు (నంబర్దార్లు) చురుగ్గా పాల్గొంటున్నారు. అందువల్ల ఇది ప్రభుత్వ నిర్మాణ కార్యక్రమానికే పరిమితం కాకుండా ప్రజల భాగస్వామ్యంతో సాగుతున్న ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంది.

- అమృత సరోవర్‌తో నీటి భద్రతకు భారీ ప్రణాళిక!
- మంచుకొండల నడుమ నీటి నిల్వలకు కొత్త బాట
- 163 గ్రామాలకు భరోసా.. 55 కోట్ల లీటర్ల సామర్థ్యం
- కరుగుతున్న మంచు.. పెరుగుతున్న నీటి కష్టాలు

వాతావరణ మార్పులకు శాస్త్రీయ పరిష్కారం

లడఖ్‌లో చలికాలాన్ని పనులకు ఆటంకంగా కాకుండా నీటి సంరక్షణకు అవకాశంగా మార్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అక్కడి భౌగోళిక పరిస్థితులు, తీవ్రమైన చలిని దృష్టిలో పెట్టుకుని శాస్త్రీయ పద్ధతుల్లో కుంటలను నిర్మిస్తున్నారు. మంచు కరిగే సమయంలో వచ్చే నీటిని నిల్వ చేయడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారా వేసవిలో ఎదురయ్యే కొరతను తగ్గించవచ్చు. మరో ముఖ్యమైన లక్ష్యం భూమి క్షీణతను అరికట్టడం. 2030 నాటికి 2.6 కోట్ల హెక్టార్ల క్షీణించిన భూమిని పునరుద్ధరించాలన్న జాతీయ లక్ష్యానికి ఈ ప్రాజెక్టు తోడ్పడనుంది. నీటి సంరక్షణ, రైతుల జీవన భద్రత, పర్యావరణ పరిరక్షణ అనే మూడు ప్రధాన లక్ష్యాలతో అమృత్ సరోవర్ ముందుకు సాగుతోంది. విజయవంతంగా అమలైతే మంచుకొండల ప్రాంతమైన లడఖ్‌లో నీటి భద్రతకు ఇది కీలక నమూనాగా నిలిచే అవకాశం ఉంది.

మొండోడు గట్టోడు

వేంపల్లి పీఠంపై గౌస్ బాబా
కొత్త రాజకీయ సమీకరణం!
ఐదు దశాబ్దాల నిరీక్షణకు తెర
బీటెక్ రవి మైనారిటీ వ్యూహం



పులివెందుల నియోజకవర్గంలో కీలకమైన వేంపల్లి మేజర్ పంచాయతీ ఎన్నికలు ఆసక్తికర రంగా మారుతున్నాయి. దాదాపు ఐదు దశా బ్దాలుగా ముస్లిం మైనారిటీ వర్గానికి కీలక మైన రాజకీయ పదవి దక్కలేదన్న అసంతృ ప్తికి ముగింపు పలికేలా కూటమి సర్పంచ్ అభ్యర్థిగా మొండోడు గౌస్ బాబాను ప్రకటిం చింది. టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి తీసుకున్న ఈ నిర్ణయం స్థానిక రాజకీయాల్లో చర్చనీ యాంశమైంది. వేంపల్లిలో ముస్లిం ఓటర్ల ప్రభావం గణనీయంగా ఉన్నప్పటికీ, వారికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదన్న అభిప్రాయం ఉంది. గతంలో వైఎస్సార్, జగన్ ముఖ్యమంత్రులుగా పనిచేసిన సమ యంలోనూ ఈ వర్గానికి కీలక పదవులు దక్కలేదనే విమర్శలు వినిపించాయి. ఇప్పుడు గౌస్‌కు అవకాశం కల్పించడం ద్వారా ఆ లోటును భర్తీ చేయాలని కూటమి ప్రయత్నిస్తోంది. జడ్పీటీసీ ఎన్నికల్లో అవకాశం చేజారిన నేపథ్యంలో సర్పంచ్ పదవిని మైనారిటీ వర్గానికి కేటా యించడం ఈ నిర్ణయానికి మరింత ప్రాధాన్యం తెచ్చింది.

కుటుంబ సేవకు రాజకీయ గుర్తింపు

గౌస్ బాబా ఎంపిక వెనుక ఆయన కుటుంబానికి ఉన్న సామాజిక గుర్తింపు కూడా కీలకంగా నిలిచింది. ఆయన తండ్రి మొండోడు పక్రుద్దీన్ మసీదు, మదరసా నిర్మాణం కోసం సుమారు రూ.10 కోట్ల విలువైన మూడు ఎకరాల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారని బీటెక్ రవి వెల్లడించారు. ఆ కుటుంబం ప్రజాసేవకు అందించిన సహకారాన్ని గుర్తించి గౌస్‌కు అవకాశం కల్పించామని తెలిపారు. కూటమి నాయకులందరితో చర్చించిన తర్వాత ఏకాభి ప్రాయంతో అభ్యర్థిని ఖరారు చేసినట్లు పేర్కొన్నా రు. వేంపల్లి పట్టణంగా విస్తరిస్తున్న నేపథ్యంలో మేజర్ పంచాయతీ సర్పం చ్ పదవి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కేవలం ఎన్నికల సమయంలో మద్దతు కోరడం కాకుండా, నిర్ణయాధికారంలోనూ మైనా రిటీలకు భాగస్వామ్యం కల్పించాలన్న సందేశాన్ని ఈ ఎంపిక ద్వారా ఇవ్వాలని కూటమి భావిస్తోంది. అయితే కుటుంబ నేపథ్యం, సామాజిక మద్దతు ఓట్లుగా మారాలంటే గౌస్ ప్రజల్లో తనకు ఉన్న ఆదరణను నిరూ పించుకోవాల్సి ఉంటుంది.

అభివృద్ధి హామీలతో ఎన్నికల ప్రచారం

సామాజిక ప్రాతినిధ్యంతో పాటు వేంపల్లి అభివృద్ధిని కూడా కూటమి ప్రధాన ప్రచార అంశంగా ముందుకు తెస్తోంది. ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా మని బీటెక్ రవి హామీ ఇచ్చారు. గత పాలకులు మధ్యలో నిలిపివేసిన రోడ్డు పనులను పూర్తి చేశామని, గండి రోడ్డు నిర్మాణానికి సంబంధించి పాత కాంట్రాక్టులు రద్దు చేసి కొత్త టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. మరో 20 నుంచి 30 రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని వెల్ల డించారు. ఇదే సమయంలో వేంపల్లిలో బియ్యం బ్లాక్ మార్కెటింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ, అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకుంటే టీడీపీపై విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అభివృద్ధి, అవినీతి నియంత్రణ, సామాజిక న్యాయం అంశాలతో ప్రజల్లోకి వెళ్లేందుకు కూటమి సిద్ధమవుతోంది. అయితే ప్రకటిం చిన హామీలు అమలులోకి వచ్చినప్పుడే ప్రజల్లో విశ్వసనీ యత పెరుగుతుంది.

పాత రాజకీయ ఘర్షణలపై మాటల యుద్ధం

ఎన్నికల వేళ ప్రత్యర్థులపై బీటెక్ రవి చేసిన వ్యాఖ్యలు స్థానిక రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిం చాయి. 1995లో వేంపల్లి ఎంపీపీ ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలు, కాల్పుల్లో వెంకటసుబ్బయ్య మరణిం చిన ఘటనను ఆయన ప్రస్తావించారు. అప్పట్లో బయట ప్రాంతాల వ్యక్తుల పాత్రపై ప్రశ్నలు సంధించారు. 2024 ఎన్నికల సమయంలో గాజులపేట పోలింగ్ బూత్‌లో టీడీపీకి చెందిన భద్ర, బీజేపీకి చెందిన హరిపై దాడి జరి గిందని ఆరోపిస్తూ, ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. గత ఘటనలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థుల విమర్శలకు సమాధానమిచ్చారు. మొత్తంగా గౌస్ బాబా అభ్యర్థిత్వం వేంపల్లిలో మైనారిటీ రాజకీయ ప్రాతినిధ్యం, అభివృద్ధి హామీలు, పాత రాజకీయ సమీకరణాలను మళ్లీ చర్చలోకి తెచ్చింది. గౌస్ విజయం సాధిస్తే వేంపల్లి రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలయ్యే అవకాశం ఉంది. అయితే ఈ వ్యూహం ఫలితం ఎన్నికల తీర్పుతోనే తేలనుంది.

భక్తి ప్రస్థానానికి రాజకీయ అండ

కోదండరాముడి కొలువైన పుణ్యక్షేత్రం.. స్వచ్ఛ ఒంటిమిట్టగా తీర్చిదిద్దుతా
వీధి వీధిలో రామనామ సంకీర్తనలు.. సర్పంచ్ అభ్యర్థి మామిళ్ల ఈశ్వరయ్య



ఆంధ్రా భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఒంటిమిట్టలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. కోదండరామస్వామి కొలువైన ఈ పుణ్యక్షే త్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో సీనియర్ టీడీపీ నాయకుడు మామిళ్ల ఈశ్వరయ్య సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతు న్నారు. ఒంటిమిట్ట మేజర్ పంచాయతీ ఉమ్మడి అభ్యర్థిగా ఆయనకు అవకాశం దక్కింది. రాజంపేట నియోజకవర్గంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఈశ్వరయ్యకు గ్రామంలో మంచి గుర్తింపు ఉంది.

పార్టీలకు అతీతంగా అందరితో సత్సంబంధాలు కొనసాగిస్తూ, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తారనే పేరుంది. నామినేషన్‌కు ముందు ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రచారానికి గ్రామస్తుల నుంచి ఘనస్వాగతం లభించింది. వీధివీధినా ప్రజలు ఆయనకు మద్దతు తెలిపారు.

స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యం..

ఒంటిమిట్ట పంచాయతీ పరిధిలోని చెంచువారి పల్లి దళితవాడలో ఈశ్వరయ్య ప్రచారానికి విశేష స్పందన కనిపించింది. సీనియర్ నాయకులు కొమర వెంకట నరసయ్య, పాముల సుబ్రమణ్యం, శ్రీ రామకృష్ణారెడ్డి, పత్తి కృష్ణయ్య, బాలమున్నయ్యతో పాటు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడిన ఈశ్వరయ్య, వెంకట నరసయ్య స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని భరోసా ఇచ్చారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామని, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేం దుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకుంటూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

ఆధ్యాత్మిక వైభవానికి కొత్త ప్రణాళిక..

ఒంటిమిట్ట ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని దేశవ్యా ప్తంగా చాటడమే తన లక్ష్యమని ఈశ్వరయ్య ప్రకటించారు. కోదండరామస్వామి ఆలయ వైభవాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేస్తానని, భక్తులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఒంటిమిట్టను స్వచ్ఛమైన, కాలుష్యరహిత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడం తన సంకల్పమన్నారు. ప్రతి వీధిలో పరిశుభ్రత కనిపించాలని, రామనామ సంకీర్తన మార్మోగాలని ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తానని వెల్లడిం చారు. రాజకీయ అనుభవం, ప్రజలతో ఉన్న అనుబంధం, రామభక్తిపై అంకి తభావంతో గ్రామ అభివృద్ధికి పనిచేస్తా నని స్పష్టం చేశారు. దీంతో ఒంటిమిట్ట పంచాయతీ ఎన్నికల్లో అభివృద్ధి, ఆధ్యాత్మిక వైభవం ప్రధాన చర్చాంశా లుగా మారాయి.

వేంపల్లి సర్పంచ్ బరిలో మైనారిటీ అభ్యర్థి!





వేంపల్లి పంచాయతీ ఎన్నికలను కూటమి ప్రతి ష్టాత్మకంగా తీసుకుంది. దాదాపు 50 ఏళ్ల తర్వాత ముస్లిం సామాజిక వర్గానికి సర్పంచ్ అభ్యర్థిగా మొండోడు గౌస్‌కు అవకాశం కల్పిం చినట్లు టీడీపీ నేత బీటెక్ రవి తెలిపారు. కూటమి నాయకుల ఏకాభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. గౌస్ తండ్రి పక్రుద్దీన్ మసీదు నిర్మాణానికి రూ.10 కోట్ల విలువైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చారని గుర్తుచే శారు. గ్రామానికి ఒక్క అవకాశం ఇస్తే రోడ్ల అభివృద్ధి పూర్తి చేస్తామని, గండి రోడ్డు కొత్త టెండర్లు 2030 రోజుల్లో పూర్తవుతాయని హామీ ఇచ్చారు. వేంపల్లిలో బియ్యం అక్రమ రవాణా పైనా ఆరోపణలు చేశారు. 1995 కాల్పుల ఘటన, 2024 ఎన్నికల సమయంలో గాజులపే టలో దాడుల ఆరోపణలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థులను ప్రశ్నించారు. ఈ అంశాలతో గౌస్‌కు మద్దతు కూడగట్టేందుకు కూటమి ప్రయత్నిస్తోంది.

సీసీ కెమెరాలతో దొంగల ముఠాకు చెక్!



ప్రొద్దుటూరు మోదంపల్లిలో జరిగిన భారీ ఇంటి దొంగతనం కేసును 2 టౌన్ పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. సీసీ కెమెరాల ఫుటేజీ, పక్కా సమాచా రంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రూ.4.04 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చాకలి వీధికి చెందిన చౌదం రాజారామ్ ఇంట్లో ఈ నెల 7, 8 తేదీల మధ్య రాత్రి దొంగలు ప్రవేశించి రూ.5.10 లక్షలు అపహరించారు. ఈ నెల 13న కేసు నమోదు చేసిన పోలీసులు, ఎస్ డీపీఓ సూచనలతో ఇన్ స్పెక్టర్ పి.వంశీనాథ్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. లాడ్జీల తనిఖీల్లో షేక్ నౌమన్ కదలికలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి, నవంబర్ 15న మారుతి అపార్ట్ మెంట్ సమీపంలో ముగ్గురిని పట్టుకున్నారు. మిగిలిన నగదును ఖర్చు చేసినట్లు నిందితులు వెల్లడిం చారని పోలీసులు తెలిపారు. బృందాన్ని ఎస్ డీపీఓ అభినందించారు. ఇళ్లు, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద కదలికలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

బకాయిలు చెల్లించేదాకా సామగ్రి కదలదు!



మున్సిపాలిటీకి చెల్లించాల్సిన బకాయిలు చెల్లిం చకుండానే ఎగ్జిబిషన్ సామగ్రిని తరలించేందుకు చేసిన ప్రయత్నాన్ని అధికారులు అడ్డుకున్నారు. ఆదివారం ప్రొద్దుటూరులోని అనీబిసెంట్ హైస్కూల్ మైదానంలో ఈ ఘటన చోటుచేసు కుంది. సామగ్రి తరలిస్తున్నారన్న సమాచారంతో కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, అసిస్టెంట్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ ఆదేశాల మేరకు సిబ్బందితో అక్కడికి చేరుకుని తరలిం పును నిలిపివేశారు. బకాయిలు చెల్లించకుండా సామగ్రిని తరలించేందుకు అనుమతించబోమని స్పష్టం చేశారు. త్రీ టౌన్ సీఐ అశోక్ కుమార్ సమక్షంలో నిర్వా హకుడు శివకుమార్ చర్చించి, నవంబర్ 16న బ్యాంక్ ష్యూరిటీ సమర్పిస్తానని, అప్పటివరకు సామగ్రి తరలించ బోనని హామీ ఇచ్చారు. రాత్రివేళ భద్రత కోసం పోలీస్ బీట్ ఏర్పాటు చేయాలని కమిషనర్ కోరారు. మున్సిపా లిటీ ఆదాయానికి, ప్రజాధనానికి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

41 రోజుల పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు



ప్రొద్దుటూరు శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో నవంబర్ 16 నుంచి డిసెంబర్ 26 వరకు మండల పూజా మహో త్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. 33 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్ కొవ్వూరు రమేష్ రెడ్డి తెలిపారు. నూతనంగా నిర్మించిన శివపార్వతుల సదన్‌ను ప్రారంభించి, 18 మెట్ల పూజ, మాలధారణ కార్యక్ర మాలు చేపట్టనున్నారు. ప్రతిరోజూ గణపతి హోమం, ప్రత్యేక పూజలు, నక్షత్ర హారతి, పడిపూజ, రథోత్సవం నిర్వహిస్తారు.

మాలధారులకు మధ్యాహ్నం, రాత్రి స్వామి భిక్ష ఏర్పాటు చేశారు. ఈ నెల 29న లక్షార్చన, డిసెంబర్ 8 నుంచి బ్రహ్మోత్సవాలు, 12న రథోత్సవం జరగనున్నాయి. దాతల సహకారంతో నిర్మించిన శివపార్వతుల సదన్‌కు పలువురు విరాళాలు అందించగా,

వెండి పీఠం సమర్పణకు భక్తులు ముందుకొచ్చారు. నవంబర్ 24న అమృతేశ్వర ఆలయంలో జ్వాలా తోరణం నిర్వహించనున్నారు.



యువ పారిశ్రామికవేత్తలకు భట్టి భరోసా

రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో ఎన్ఎస్ ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములు, రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తామని ప్రకటించారు. ఉన్నత విద్య పూర్తిచేసిన నిశాంత్, సాజన్ ఉద్యోగాల కోసం ఎదురుచూడ కుండా పరిశ్రమ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పది మందికి ఉపాధి కల్పించాలనే వారి లక్ష్యం మరింత మంది యువతకు స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక ప్రాంతంలో స్థలం కేటాయించేం దుకు ప్రభుత్వం సహకరించిందని తెలిపారు. యువత ఉద్యోగాల కోసం వెతకడం కాకుండా పరిశ్రమలు స్థాపించి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రముఖ కవి, వాగ్గేయకారుడు జయరాజు పాటల ద్వారా కార్మికుల హక్కులు, సింగరేణి సమస్యలు, అణ గారిన వర్గాల జీవితాలపై సామాజిక చైతన్యం తీసుకొచ్చారని భట్టి కొని యాడారు. కళాకారులను గౌరవించడం ప్రభుత్వ బాధ్యతన్నారు. పరిశ్ర మల అభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, చెట్లను తొలగించకుండా పరిశ్రమను అభివృద్ధి చేయాలనే నిర్వాహకుల ఆలోచన అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రీసర్వే ఒత్తిడి తగ్గించండి

శిథిల కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించండి
ఉద్యోగులకు పనిభారం తగ్గించాలన్న బొప్పరాజు



అమరావతి-విజయవాడ: రాష్ట్రంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనుల్లో వేగం కంటే ఖచ్చితత్వం, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) ప్రభుత్వాన్ని కోరింది. విజయవాడ రెవెన్యూ భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. రీసర్వేతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, తుపాను సహాయక చర్యలు, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, జనగణన శిక్షణ, పండుగ విధులు, ప్రోటోకాల్ బాధ్యతలతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నా రని 28 జిల్లాల ప్రతినిధులు వివరించారు. లక్ష్యాల పేరుతో అదనపు భారం మోపవద్దని కోరారు.

రూ.300 కోట్ల నిధులు విడుదల చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకోవడంపై అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో నిర్మాణాలు పూర్తయిన 108 తహసీల్దార్ కార్యాలయాలు, 8 రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు బిల్లులు, బడ్జెట్ విడుదల కాకపోవడంతో ఇంకా శాఖలకు అప్పగించలేదని తెలిపింది. వీటి పెండింగ్ అవసరాల కోసం రూ.300 కోట్లకు పైగా నిధులు విడుదల చేయాలని కోరింది. రాజోలు తహసీల్దార్ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరి రికార్డులు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని, చల్లపల్లి కార్యాలయ శిథిల భవనం కూలి సిబ్బందికి గాయాలయ్యాయని గుర్తుచేసింది. పెండింగ్ నిధులు విడుదల చేసి పూర్తయిన భవనాలను శాఖలకు అప్పగించాలని ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు.

పేదల పాలిట దేవుడు గుత్తి సుబ్రహ్మణ్యం

వేలాది శస్త్రచికిత్సలతో చెరగని ముద్ర
నిరాడంబర జీవితం, నిస్వార్థ వైద్యసేవ



తెనాలి ప్రముఖ సీనియర్ వైద్యుడు డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యం 83 ఏళ్ల వయస్సులో గురువారం రాత్రి కన్ను మూశారు. ఆయన మృతితో తెనాలి వైద్యరంగంలో ఒక సేవా శకం ముగిసింది. చీరాల సమీపంలోని జాంద్రపే టలో గుత్తి సుబ్బయ్య, వెంకట శేషమ్మ దంపతులకు జన్మించిన సుబ్రహ్మణ్యం స్వగ్రామంలో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. చీరాలలో ఇంటర్మీడియట్ చదివి, గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ అభ్యసించి గోల్డ్ మెడల్ సాధించారు. అనంతరం ఎంఎస్ జనరల్ సర్జ రీలోనూ బంగారు పతకం పొందారు. చదువులో ప్రతిభను వైద్యసేవలోనూ కొనసాగిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదిం చారు.

మంగళగిరిలో పేదల మన్ననలు

వైద్య వృత్తి ప్రారంభంలో అమ్మనబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలందించిన ఆయన, గుంటూరు మెడికల్ కళాశాల ప్రభుత్వ ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఐదేళ్లు పనిచేశారు. అనంతరం మంగళగిరి, మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా, తెనాలి ఏరియా ఆసుపత్రిలో సివిల్ సర్జన్‌గా బాధ్యతలు నిర్వహిం చారు. 1995 నుంచి 1998 వరకు మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో అందించిన సేవలు ఆయనకు అక్కడి పేద ప్రజల ఆదరాభిమానాలను సంపాదించిపెట్టాయి. మంగ ళగిరిలో శస్త్రచికిత్స అవసరమైనప్పుడు స్థానిక వైద్యులు ప్రత్యేకంగా ఫోన్ చేసి ఆయనను పిలిపించేవారని సహచ రులు గుర్తుచేసుకుంటున్నారు. తెనాలి, పరిసర ప్రాంతాల్లోని పలు ఆసుపత్రుల్లో వేలాది శస్త్రచికిత్సలు చేసి ఎంతోమందికి ఆరోగ్యాన్ని అందించారు.

పదవులు మారినా.. మారని నిరాడంబరత..

హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో అడి షనల్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన 2000 సంవత్సరంలో పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత కూడా తెనాలిలోని శ్రీ సాయి సుధా నర్సింగ్ హోమ్ ద్వారా వైద్యసేవలు కొనసా గించారు. ఉన్నత పదవిలో పనిచేసినా జీవితాంతం సామా న్యుడిగానే జీవించారు. పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించడం ఆయన ప్రత్యేకత అని స్థానికులు ఆయనను గుర్తుచేసుకున్నారు. ఆయన సేవలు పొందని రోగులు, ఆసుపత్రులు ఈ ప్రాంతంలో లేవనేంతగా ప్రజలకు చేరువయ్యారు.

కన్నీటి వీడ్కోలు.. సేవలకు నివాళి..

డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యం అంత్యక్రియలు శనివారం ఆయన స్వగ్రామమైన చీరాల సమీపంలోని జాంద్రపే టలో పూర్తయ్యాయి. స్వగృహం నుంచి స్మశానవాటిక వరకు సాగిన అంతిమయాత్రలో వందలాది మంది గ్రామస్తులు, వైద్యులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. కుమారుడు డాక్టర్ ప్రసాద్ అంత్యక్రియలు నిర్వహిం చారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ సభ్యులు, పలువురు ప్రముఖ వైద్యులు ఆయన మృతికి సంతాపం తెలిపారు. వైద్య విద్యార్థులకు బోధించి, ఎంతోమంది వైద్యులను తీర్చిదిద్దిన గురువుగా, పేదలకు అండగా నిలిచిన వైద్యుడిగా ఆయన సేవలను స్మరించుకున్నారు. పదవులు, పురస్కారాల కంటే ప్రజల ప్రేమే గొప్ప గుర్తింపు అని తన జీవితంతో చాటిన డాక్టర్ సుబ్రహ్మణ్యం జ్ఞాపకాలు తెనాలి ప్రాంత ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి.

బద్వేల్‌లో ప్రజాస్వామ్యానికి సంకెళ్లు?

స్వేచ్ఛ కావాలంటున్న స్థానికులు..తరం మారిందా.. మార్చేస్తున్నారా..!?

టీడీపీ ఇన్‌ఛార్జి మంచూరుపై ఆగ్రహం

సర్పంచ్ ఎన్నికల్లో ఓటు కోసం సమరం



ఈ చరిత్ర ఏంటి?



బద్వేలు రాజకీయ చరిత్రలో ఇప్పుడు ఒక విచిత్రమైన అధ్యాయం మొదలైంది. ఒకప్పుడు ఎన్నికలంటే ఇక్కడ ఆసక్తి ఉండేది. గెలుపోటములతో సంబంధం లేకుండా గ్రామాల్లో రాజకీయ చర్చలు జరిగేవి. అభ్యర్థులు ఇంటింటికీ తిరిగేవారు. ప్రజలను పలకరించేవారు. తమకు ఓటు వేయాలని అభ్యర్థించేవారు. ప్రత్యర్థులు సైతం ప్రచారంలో పోటీపడేవారు. గెలిచినవారికి అభినందనలు, ఓడినవారికి పరామర్శలు ఉండేవి. రాజకీయ వైరం ఉన్నా వ్యక్తిగత సంబంధాలు కొనసాగేవి. బద్వేలు రాజకీయ సంస్కృతికి ఒక ప్రత్యేకత ఉండేది. ఉమ్మడి కడప జిల్లాలోని జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో కనిపించే ఫ్యాక్షన్ ఛాయలు బద్వేలు రాజకీయాల్లో అంతగా కనిపించేవి కావు. ఇక్కడా వర్గాలు ఉన్నాయి. ఆధిపత్య పోరాటాలు ఉన్నాయి. నాయకుల మధ్య రాజకీయ విభేదాలు ఉన్నాయి. కానీ ఎన్నికల సమయంలోనే ఆ వేడి ఎక్కువగా కనిపించేది. దివంగత బిజివేముల వీరారెడ్డి, శివరామకృష్ణారావు మధ్య జరిగిన రాజకీయ పోటీ బద్వేలు చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. వీరారెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1985లో ఆయనకు, శివరామకృష్ణారావుకు మధ్య జరిగిన పోటీలో మెజారిటీ కేవలం 9,266 ఓట్లు మాత్రమే. 1989లో శివరామకృష్ణారావు విజయం సాధించారు. 1994, 1999 ఎన్నికల్లో వీరారెడ్డి తిరిగి గెలిచారు. ఈ పరిణామాలు బద్వేలు ఓటరు స్వభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇక్కడి ప్రజలు ఏ నాయకుడికీ, ఏ పార్టీకీ శాశ్వతంగా బందీలు కాలేదు. 2001 ఉప ఎన్నికలో విజయమ్మకు అవకాశం ఇచ్చారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి గోవిందరెడ్డిని గెలిపించారు. ఆ తర్వాత రాజకీయ పరిణామాలకు అనుగుణంగా వైసీపీకి మద్దతు పలికారు. అంటే బద్వేలు ప్రజలు ఎప్పుడూ తమ నిర్ణయాన్ని తామే తీసుకున్నారు. నాయకులను మార్చారు. పార్టీలను మార్చారు. తమకు నచ్చినవారిని గెలిపించారు. ప్రజల తీర్పే అంతిమమనే రాజకీయ సంప్రదాయం ఇక్కడ ఉండేది. ఇప్పుడు మాత్రం ఆ సంప్రదాయానికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎన్నికలు జరుగుతున్నాయి. పదవులు దక్కుతున్నాయి. విజయోత్సవాలు జరుగుతున్నాయి. కానీ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం కోల్పోతే ఆ విజయాలకు అర్థమేమిటి? ఇదే ఇప్పుడు బద్వేలు ప్రజలను వేధిస్తున్న ప్రశ్న. ముఖ్యంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి నాయకత్వంలో నాలుగు నెలల్లోనే చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు బద్వేలు పాత రాజకీయ సంస్కృతికి కొత్త ప్రశ్నలను సంధిస్తున్నాయి. నాయకత్వం అంటే ప్రత్యర్థులను ఎదుర్కోవడమా? లేక ప్రత్యర్థులకు పోటీ చేసే అవకాశమే లేకుండా చేయడమా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై కూడా ఉంది.

2021లో ప్రజల తీర్పు.. పోటీకి అవకాశం

2021 మున్సిపల్ ఎన్నికలను ఒకసారి గుర్తు చేసుకోవాలి. అప్పట్లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉంది. బద్వేలు రాజకీయంగా వైసీపీకి అనుకూలమైన నియోజకవర్గం. అసెంబ్లీ ఉప ఎన్నికలోనూ వైసీపీ తన బలాన్ని నిరూపించుకుంది. అయినప్పటికీ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు పోటీని చూసే అవకాశం దక్కింది. అప్పటికి 35 వార్డులున్న మున్సిపాలిటీలో అన్ని స్థానాల కు ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఫలితాల ప్రకారం వైసీపీ 28 స్థానాలు గెలుచు కుంది. టీడీపీకి మూడు స్థానాలు దక్కాయి. స్వతంత్రు లు నాలుగు స్థానాల్లో విజయం సాధించారు. ఈ ఫలితా ల్లో ముఖ్యమైన విషయం ఏమిటంటే అధికార పార్టీకి స్పష్టమైన ఆధిక్యం వచ్చినప్పటికీ ప్రత్యర్థులు పోటీ చేశారు. స్వతంత్ర అభ్యర్థులు సైతం గెలిచారు. అంటే అధికార పార్టీకి అనుకూలమైన వాతావరణంలోనూ ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థులను ఎన్నుకునే అవకాశం పొందారు. వైసీపీ 28 స్థానాలు గెలుచుకోవడం ప్రజా మద్దతుకు రాజకీయ సంకేతం. అదే సమయంలో టీడీపీ మూడు స్థానాలు, స్వతంత్రులు నాలుగు స్థానాలు గెలవడం ప్రజల తీర్పులోని వైవిధ్యాన్ని చూపించింది. ఒక పార్టీకి 28 స్థానాలు వచ్చాయని మిగిలిన స్థానాల్లో పోటీ ఉండకూడదని ఎవరూ చెప్ప లేదు. ప్రజాస్వామ్యంలో అధికార పార్టీకి అనుకూలత ఉండవచ్చు. ప్రతిపక్షానికి బలం ఉండవచ్చు. కానీ పోటీ చేసే హక్కు అందరికీ సమానంగా ఉండాలి. ఇప్పుడు 2026 ఎన్నికలతో పోల్చి చూస్తే ఈ రెండు పరిస్థితుల మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తోంది. 2021లో ప్రజలు బ్యాలెట్ ద్వారా తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. గెలిచినవారికి పదవులు దక్కాయి. ఓడినవారికి ప్రజల తీర్పు తెలిసింది. అధికార పార్టీకి నిజంగా ప్రజల మద్దతు ఉంటే పోటీకి ఎందుకు భయపడాలి? 35 స్థానాల్లోనూ పోటీ జరిగి 35 స్థానాల్లోనూ గెలిచినా అది ప్రజల ముందు నిరూపించుకున్న విజయమే. కానీ ప్రత్యర్థులు బరిలో లేకుండా వచ్చిన ఏకగ్రీవాన్ని ప్రజా మద్దతుకు కొలమానంగా చూపించడం మరో విషయం. నామినేషన్ దశలోనే ఏకగ్రీవమైన స్థానానికి, ప్రజలు ఓటు వేసి గెలిపించిన స్థానానికి మధ్య తేడా ఉంటుంది. ఈ రెండింటినీ ఒకే గాటన కట్టలేం. 2021లో వైసీపీ గెలిచిన స్థానాలకు ఓట్ల రూపంలో ప్రజల తీర్పు ఉంది. 2026లో ఏకగ్రీవమైన స్థానాలకు అలాంటి ప్రత్యక్ష పోటీ తీర్పు లేదు. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా ఏకగ్రీవాల సంఖ్యనే ప్రజాదరణగా ప్రచారం చేయడం రాజకీయంగా ఆత్మపరిశీలనకు దూరంగా ఉండటమే అవుతుంది.

నాలుగు నెలల్లో 39 ఏకగ్రీవాలు.. ఇదేనా రికార్డు?

2026 మున్సిపల్ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి బద్వేలు రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారి పోయింది. 35 వార్డులున్న మున్సిపాలిటీ 40 వార్డులకు విస్తరించింది. కొత్త వార్డులు ఏర్పడ్డాయి. కొత్త రాజకీ య సమీకరణాలు వచ్చాయి. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. వైసీపీ ప్రతిపక్షంలోకి వెళ్లింది. ఈ నేపథ్యంలో బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జిగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కేవలం నాలుగు నెలల రాజకీయ అనుభవంతోనే ఆయన నాయకత్వంలో ఇంతటి ఫలితం సాధించామని ప్రచారం జరిగింది. 40 వార్డులకు 39 ఏకగ్రీవం కావడం, ఒక్క వార్డులో మాత్రమే పోలింగ్ జరగడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఫలితాల్లో టీడీపీకి 36, జనసేనకు రెండు, స్వతంత్రులకు రెండు స్థానాలు దక్కాయి. చైర్‌పర్సన్ స్థానం కూడా ఏకగ్రీవంగా టీడీపీ ఖాతాలోకి వెళ్లింది. ఇవి ఎన్నికల ఫలితాల గణాంకాలు. అయితే ఈ గణాంకాల వెనుక ఉన్న రాజకీయ పరిస్థితులే ఇప్పుడు అసలు చర్చ. నాలుగు నెలల్లోనే బద్వేలు రాజకీయాలను పూర్తిగా మార్చేశామని చెప్పుకోవడం సులభం. కానీ ఆ మార్పు ప్రజల అభిమానం వల్ల వచ్చిందా? ప్రత్యర్థుల బలహీనత వల్ల వచ్చిందా? లేక నామినేషన్ల సమయంలో ఏర్పడిన వివాదాల ప్రభావమా? అనేది తేలాల్సి ఉంది. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులను అడ్డుకోవడం, పత్రాలను బలవంతంగా తీసుకెళ్లడం, చించివేయడం, అధికారులపై ఒత్తిడి తీసుకురావడం వంటి ఆరోపణలు వెలువడ్డాయి. ముఖ్యంగా వైసీపీ నాయకులు చేసిన ఆరోపణల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. మున్సిపల్ కార్యాలయం లోకి వెళ్లి అధికారులపై ఒత్తిడి తెచ్చి వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను బయటకు తీసుకెళ్లి చించివేశా రని వైసీపీ నాయకులు ఆరోపించారు. అయినప్పటికీ ఒక నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరు ఇంత తీవ్రమైన ఎన్నికల వివాదంలో వినిపించినప్పుడు దానిని సాధారణ రాజకీయ విమర్శగా కొట్టిపారే యలేం. ఆరోపణలు నిజమా? కాదా? అనే అంశాన్ని తేల్చాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉంది. 39 ఏకగ్రీవాల రికార్డును ప్రచారం చేసుకుంటున్న నాయకత్వం, ఆ ఏకగ్రీవాలు ఎలా సాధ్యమయ్యాయన్న ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పాలి.

మంచూరు సూర్యనారాయణ రెడ్డి చుట్టూ ప్రశ్నలు


బద్వేలు రాజకీయ పరిణామాల్లో ఇప్పుడు మంచూరు సూర్యనారాయణ రెడ్డి పేరు ప్రత్యేకంగా చర్చకు వస్తోం ది. నాలుగు నెలల క్రితం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, స్థానిక రాజకీయాల్లో తన దైన ముద్ర వేయాలని ప్రయత్నించడం సహజమే. పార్టీని బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, సీనియర్ నాయకులకు గుర్తింపు ఇవ్వడం నాయకుడి బాధ్యతలే. అయితే రాజకీయ బలం నిరూ పించుకోవడానికి ప్రత్యర్థులకు పోటీ చేసే అవకాశం లేకుండా చేయాల్సిన అవసరం ఏముంది? వైసీపీ నాయకులు చేసిన ఆరోపణల ప్రకారం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ పత్రాల వ్యవహారంలో సూర్యనారాయణ రెడ్డి జోక్యం చేసుకున్నట్లు విమర్శలు వచ్చాయి. మరోవైపు నామినేషన్ల పరిశీలనలో అభ్యర్థుల సంతకాలు ఫోర్జరీ చేసి తిరస్కరించారని, అధికారుల వ్యవహారంపై అనుమానాలు ఉన్నాయని వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి రాచపూడి సాయి సైతం తన నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఇన్ని ఫిర్యాదులు వెలువడినప్పుడు సూర్యనారాయణ రెడ్డి నాయకత్వం ప్రజల ముందు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. నామినేషన్ పత్రాలు నిజంగా చించివేశారా? అభ్యర్థుల సంతకాలపై వివాదం ఎందుకు వచ్చింది? సీసీ కెమెరాల దృశ్యాలు ఏమి చెబుతున్నాయి? అభ్యర్థులు సమర్పించిన పత్రాలకు రసీదులు ఉన్నాయా? నామినేషన్లు తిరస్కరించిన అధికారులు అందుకు కారణాలు లిఖితపూర్వకంగా వెల్లడించారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వస్తేనే వివాదానికి ముగింపు లభిస్తుంది. మరోవైపు మంచూరు సూర్యనారాయణ రెడ్డి నవంబర్ 12న జరిగిన విలేకరు ల సమావేశంలో తనపై వచ్చిన టికెట్ల విక్రయం, ముడుపుల ఆరోపణలను ఖండించారు. అవి నిరూపిస్తే డీసీసీబీ పదవితో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. గోవిందరెడ్డిపై కూడా ఆయన ఎదురుదాడి చేశారు. అంటే ఇరువర్గాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. అయితే టికెట్ల విక్రయ ఆరోపణలను ఖండించడం ఒక అంశం. నామినేషన్ల ప్రక్రియపై వచ్చిన అభ్యంతరాలకు సమాధానం ఇవ్వడం మరో అంశం. రెండింటినీ కలిపి చూడలేం. ఒక ఆరోపణను ఖండించినంత మాత్రాన మరో వివాదం ముగిసిపోదు. సూర్యనారాయణ రెడ్డి తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలంటే ప్రత్యర్థుల ఆరోపణలకు ఆధారాలతో సమాధానం చెప్పాలి. ప్రజాస్వామ్య ప్రక్రియపై అనుమానాలు తొలగించాలి.

మున్సిపల్ వివాదం నుంచి పల్లెల్లో ప్రజాస్వామ్య పోరాటం

మున్సిపల్ ఎన్నికల వివాదం ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికల చర్చకు కొత్త ప్రశ్నలను తీసుకొచ్చింది. బద్వేలు గ్రామాల్లో వినిపిస్తున్న మాట రాజకీయ నాయకులకు హెచ్చరికలా ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో ఏం జరిగిందో జరిగిపోయింది. కనీసం పంచాయతీ ఎన్నికల్లోనైనా మా ఓటు హక్కును కాపాడండి. మా గ్రామానికి మేమే సర్పంచ్‌ను ఎన్నుకుంటాం. మా అభ్యర్థిని మేమే నిర్ణయించుకుంటాం. మా ఓటును మేమే వేస్తాం. ఎవరి ఒత్తిడికీ తలొగ్గం. అవసరమైతే పోరాడతాం. ఇదీ పల్లెవాసుల్లో కనిపిస్తున్న ఆకాంక్ష. దీన్ని ఒక పార్టీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంగా చూడకూడదు. అధికార పార్టీకి వ్యతిరేకంగా ప్రతిపక్షం చేస్తున్న రాజకీయ ప్రచారంగా కూడా కొట్టిపారేయకూడదు. ఓటు హక్కు విషయంలో ప్రజల్లో ఏర్పడుతున్న అసంతృప్తిని అన్ని పార్టీలు అర్థం చేసుకోవాలి. 2021లో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం లేకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా వచ్చాయి. ఇప్పుడు 2026లో టీడీపీ కూటమి అధికారంలో ఉండగా వైసీపీ అభ్యర్థులు అదే తరహా ఆరోపణలు చేస్తున్నారు. అధికారంలో ఉన్న పార్టీ మారింది. ఆరోపణలు చేసే పార్టీ మారింది. కానీ నామినేషన్ల చుట్టూ వివాదాలు మాత్రం కొనసాగుతున్నాయి. ఇక్కడే రాజకీయ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. అధికారం శాశ్వతం కాదు. ఈరోజు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండవచ్చు. ఈరోజు ప్రతిపక్షంలో ఉన్నవారు రేపు అధికారంలోకి రావచ్చు. కానీ ప్రజల ఓటు హక్కు మాత్రం ఏ ప్రభుత్వంలోనూ మారకూడదు. అందుకే మంచూరు సూర్యనారాయణ రెడ్డి నాయకత్వం గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రత్యేక బాధ్యత తీసుకోవాలి. మున్సిపల్ ఎన్నికల సమయంలో వచ్చిన ఆరోపణలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలి. గ్రామాల్లో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు నామినేషన్ల దాఖలు చేయడానికి భద్రత కల్పించాలి. మహిళా అభ్యర్థులకు ప్రత్యేక రక్షణ ఉండాలి. నామినేషన్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు పనిచేయాలి. ఎన్నికల అధికారులు ప్రతి అభ్యర్థి పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలి. తిరస్కరణకు కారణాలను లిఖితపూర్వకంగా వెల్లడించాలి.

ఏకగ్రీవాల రికార్డా? ప్రజల విశ్వాసమా?

ఇకనైనా బద్వేలు రాజకీయ నాయకులు ఆత్మపరి శీలన చేసుకోవాలి. ప్రత్యర్థులు నామినేషన్లు వేయాలి. ప్రచారం చేయాలి. ప్రజలను కలవాలి. ఓటర్లను తమ వైపు తిప్పుకోవాలి. ఆ తర్వాత గెలిస్తేనే ఆ విజయానికి సంపూర్ణ రాజకీయ విలువ ఉంటుంది. ముఖ్యంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తును ఏకగ్రీవాల సంఖ్యతో కాకుండా ప్రజల్లో సంపాదించే విశ్వాసంతో నిర్మించుకోవాలి. ప్రత్యర్థులు బరిలో ఉంటేనే తన బలాన్ని నిరూపించుకునే అవకాశం ఉంటుంది. పోటీ లేకుండా వచ్చిన పదవులు నాయకు డికి తాత్కాలిక రాజకీయ అధిక్యాన్ని ఇవ్వవచ్చు. కానీ ప్రజల మనసుల్లో ఎంత స్థానం ఉందో చెప్పలేవు. ప్రత్యర్థులను అడ్డుకోకుండా గెలవడం నాయకత్వ సామ ర్థ్యం. ప్రత్యర్థులను అడ్డుకోకుండా, ప్రజల నమ్మకాన్ని గెలుచుకొని విజయం సాధించడం ప్రజాస్వామ్య నాయ కత్వం. ఈ రెండింటి మధ్య ఎంతో తేడా ఉంది. బద్వేలు చరిత్రను తిరగరాస్తున్నామని చెప్పుకునేవారు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. చరిత్రలో నిలిచేది ఏకగ్రీవాల సంఖ్య కాదు. ప్రజల గుండెల్లో నిలిచిన నాయకత్వం. ఎన్ని పదవులు దక్కించుకున్నారన్నది కాదు. ప్రజల కష్టకాలంలో ఎవరు అండగా నిలిచారన్నదే గుర్తుండిపోతుంది. సూర్యనారాయణ రెడ్డి తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తున్నారు. ప్రత్యర్థు లపై విమర్శలు చేస్తున్నారు. తన పదవులకు రాజీనామా చేయడానికి కూడా సిద్ధమని ప్రకటిస్తున్నారు. ఇప్పుడు ఆయన ముందు ఉన్న అసలైన అవకాశం ఆరోపణలకు మాటలతో సమాధానం చెప్పడం మాత్రమే కాదు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిరూపించడం. ప్రత్యర్థులందరికీ సమాన అవకాశం కల్పించడం. తన నాయకత్వంలో ఎవరూ భయపడకుండా నామినేషన్లు వేయగలరని ప్రజలకు భరోసా ఇవ్వడం. అప్పుడు మాత్రమే ఆయన రాజకీయ విజయాలకు ప్రజాస్వామ్య విలువ పెరుగుతుంది. బద్వేలు ప్రజలకు నాయకుల మధ్య ఆధిపత్య పోరుతో పనిలేదు. తమ ఓటును తామే వేయాలన్న ఆకాంక్ష ఉంది. తమ గ్రామంలో ఎవరు సర్పంచ్ కావాలో తామే నిర్ణయించుకోవాలను కుంటున్నారు. తమ వార్డులో ఎవరు కౌన్సిలర్ కావాలో తామే తేల్చుకోవాలనుకుంటున్నారు. ఎన్నికల్లో ఓడిపోవడానికి సిద్ధమే కానీ ఓటు వేసే అవకాశాన్ని కోల్పోవడానికి సిద్ధంగా లేమని చెబుతున్నారు. ఈ గొంతును అధికార పార్టీ వినాలి. ప్రతిపక్షం కూడా గౌరవించాలి. ప్రజలను గెలవాలి. ప్రజల నమ్మకాన్ని సంపాదించాలి. బద్వేలు రాజకీయ చరిత్ర ఏ సిరాతో రాయబడాలి? అధికారం అనే సిరాతోనా? ఆధిపత్యం అనే సిరాతోనా? ప్రజల అభిమానం అనే సిరాతోనా? మంచూరు సూర్యనారాయణ రెడ్డి సహా బద్వేలు నాయకత్వం సమాధానం చెప్పాల్సిన ప్రశ్న ఇదే.



దోషులెవరు? రికార్డులెక్కడ?

ఆక్రమణదారులకు అండ ఎవరిది?
వ్యవస్థల వెనుక అదృశ్య శక్తులెవరు?

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పంచాయతీలో ఆస్తి పన్నుల వసూళ్ల వ్యవహారం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. విద్యాసంస్థలు, పరిశ్రమలు, హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలు పెద్ద సంఖ్యలో ఉన్న ప్రాంతంలో నాన్ రెసిడెన్షియల్ ఆస్తి పన్నుల వసూళ్లు వరుసగా పదకొండేళ్లపాటు నిల్‌గా నమోదవడం విస్మయం కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వ అధికారిక ఈగ్రామస్వరాజ్ పోర్టల్‌లో పంచాయతీ అధికారులు నమోదు చేసిన వివరాల ప్రకారం 2011-12 నుంచి 2024-25 వరకు రెసిడెన్షియల్ ఆస్తి పన్నుల ద్వారా రూ.14.91 కోట్లు, నాన్ రెసిడెన్షియల్ పన్నుల ద్వారా రూ.72.65 లక్షలు.. మొత్తంగా రూ.15.64 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. అయితే ఏళ్లవారీగా కనిపిస్తున్న భారీ వ్యత్యాసాలు, నిల్ నమోదులు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు ఉన్న ప్రాంతంలో పదకొండేళ్లపాటు పన్ను వసూళ్లు నిల్‌గా ఎందుకు చూపించారు? ఇది లెక్కల పొరపాటా? అధికారుల నిర్లక్ష్యమా? లేక ప్రభుత్వ ఆదాయానికి గండి పడేలా జరిగిన వ్యవహారమా? అన్నది తేలాలి. ఈ గణాంకాలు అక్రమాలను నిర్ధారించకపోయినా, పన్నుల అంచనా, వసూళ్లు, మినహాయింపులు, బ్యాంకు జమలపై స్వతంత్ర విచారణను కోరుతున్నాయి. 2011-12 నుంచి 2024-25 వరకు పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచుల పదవీకాలంలో జరిగిన ఆర్థిక లావాదేవీలను సమగ్రంగా పరిశీలించాలి. ప్రతి ఏడాది ఎంత పన్ను విధించారు? ఎంత వసూలు చేశారు? ఎంత బకాయి ఉంది? వసూలైన మొత్తం ప్రభుత్వ ఖాతాలో జమైందా? అనే అంశాలకు అసలు రికార్డులతో సమాధానం చెప్పాలి. ఎందుకంటే ఆస్తి పన్నులే స్థానిక సంస్థలకు ప్రధాన ఆదాయ వనరు. రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రజా సేవలకు ఆ నిధులే ఆధారం. ప్రజాధనానికి సంబంధించిన లెక్కల్లో ఇన్ని వ్యత్యాసాలు కనిపిస్తున్నా పాలక యంత్రాంగం మౌనంగా ఉండటం సరికాదు. గతంలో పనిచేసిన అధికారులు మొదలుకొని ప్రస్తుత పాలకుల వరకు బాధ్యతను నిర్ధారించి, ప్రతి రూపాయికి లెక్క చెప్పించడం ప్రభుత్వ కర్తవ్యం.

రుద్రారం పన్నుల లెక్కల్లో భారీ గోల్‌మాల్?

రూ.15.64 కోట్ల వసూళ్లు.. 11 ఏళ్లు నిల్..!

ప్రజాధనానికి లెక్కలేవీ? అధికారుల బాధ్యత ఏదీ?

పదకొండేళ్లు నిల్.. గీతం, పరిశ్రమల పన్నుల సంగతేంటి?

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైనది నాన్ రెసిడెన్షియల్ ఆస్తి పన్నుల వసూళ్ల లెక్కలు. ఈగ్రామ స్వరాజ్ పోర్టల్ ప్రకారం 2011-12 నుంచి 2021-22 వరకు వరుసగా పదకొండేళ్లు ఈ పన్నుల వసూళ్లు నిల్‌గా నమోదయ్యాయి. 2022-23లో ఒక్కసారిగా రూ.57,45,296 వసూలైనట్లు చూపగా, 2023-24లో మళ్లీ నిల్, 2024-25లో రూ.15,20,047గా నమోదైంది. రెసిడెన్షియల్ పన్నుల వసూళ్లలోనూ భారీ వ్యత్యాసాలున్నాయి. 2018-19లో రూ.2,19,49,339 వసూలైనట్లు చూపగా, 2019-20లో నిల్‌గా నమోదు చేశారు. 2020-21లో రూ.99,87,509, 2021-22లో రూ.2,14,63,571, 2024-25లో రూ.3,22,00,627 వసూలైనట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా పరిశీలించాల్సినది గీతం డీమ్డ్ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్. అధికారిక సమాచారం ప్రకారం 2009లోనే రుద్రారంలో క్యాంపస్ ఏర్పాటైంది. అదే ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆఫ్ క్యాంపస్ ఏర్పాటుకు అనుమతిచ్చింది. ఇంతటి పెద్ద విద్యాసంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్న ప్రాంతంలో పదకొండేళ్ల పాటు నాన్ రెసిడెన్షియల్ పన్నులు నిల్‌గా ఎలా నమోద య్యాయి? యూనివర్సిటీ భవనాలు, పరిపాలనా కార్యాలయాలు, హాస్టళ్లకు పన్ను విధించారా? డిమాండ్ నోటీసులు ఇచ్చారా? చెల్లింపులు జరిగాయా? మినహా యింపులు ఉంటే ఏ ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా ఇచ్చారు? అనే వివరాలు బయటపెట్టాలి. మరోవైపు 1999 మే 4న విలీనమైన ఎంవైకే లాటిక్రీట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవహారంపైనా విచారణ జరగాలి. ఈ సంస్థ రుద్రారంలో ఎప్పుడు కార్యకలాపాలు ప్రారంభించింది? ఏ సర్వే నంబర్లలో ఎంత భూమిని వినియోగిస్తోంది? ఆస్తుల యాజమాన్యం ఎవరిది? ఏటా ఎంత పన్ను విధించారు? ఎంత వసూలు చేశారు? అనే వివరాలు సేకరించాలి. కంపెనీ విలీన తేదీ ఒక్కటే రుద్రారంలో కార్యకలాపాల ప్రారంభానికి ఆధారం కాదు. వాస్తవ కార్యకలాపాలు, ఆస్తుల వివరాలు, పన్ను వర్తింపును రికార్డులతో నిర్ధారించాలి. గీతం, ఎంవైకే లాటిక్రీట్‌తో పాటు శ్రీ చైతన్య విద్యా సంస్థలు, గ్రోయింగ్ సీడ్స్ బాయ్స్ హాస్టల్, శ్రావ్య ఎగ్జిక్యూటివ్ లేడీస్ హాస్టల్, సిగ్నోడ్ ఇండియా లిమిటెడ్, రుద్ర ఇండస్ట్రీస్, ప్రాంప్ట్ ఇండస్ట్రీస్, శ్రీ లలిత ఇండస్ట్రీస్, హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల ఆస్తులపైనా పరిశీలన జరగాలి. ఎవరికి పన్ను విధించారు? ఎవరికి మినహాయింపు ఇచ్చారు? ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం ఎంత? పన్ను ఎగవేత జరిగితే బాధ్యులెవరు? ఈ ప్రశ్నలకు ఆధారాలతో సమాధానం చెప్పాల్సిందే.

ఫిర్యాదు చేసినా స్పందన ఏదీ?
ఎంపీడీఓ బాధ్యత ఎక్కడ?

ఆస్తి పన్నుల లెక్కల్లో వ్యత్యాసాలపై హైదరాబాద్‌కు చెందిన ఆర్టీఐ కన్సల్టెంట్ 2025 ఏప్రిల్ 23న పటాన్‌చెరు ఎంపీడీఓకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఈగ్రామస్వరాజ్ పోర్టల్ గణాంకాలను జతచేసి, 2011-12 నుంచి 2024-25 వరకు ఆస్తి పన్నుల అంచనా, వసూళ్లపై సమగ్ర విచారణ కోరారు. పన్ను అంచనా రిజిస్టర్లు, డిమాండ్ అండ్ కలెక్షన్ రిజిస్టర్లు, రసీదులు, నోటీసులు, బ్యాంకు జమలు పరిశీలించి, గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచుల బాధ్యతలు నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలు అందకపోవడంతో 2025 మే 9న ఆర్టీఐ దరఖాస్తు ద్వారా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ కోరారు. అయినా సమాచారం రాకపోవడంతో తెలంగాణ సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ నోటీసులు జారీ చేయగా, 2026 ఏప్రిల్ 4, 23 తేదీల్లో విచారణ జరిగింది. ఈ సందర్భంగా రుద్రారం పంచాయతీ ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనమైనందున రికార్డుల లభ్యతపై అధికారులు వాయిదా కోరారు. కానీ విలీనం పేరుతో గత పరిపాలనా బాధ్యతల నుంచి తప్పించుకోలేరు. ఫిర్యాదు ఇన్‌వార్డ్ రిజిస్టర్‌లో నమోదైందా? విచారణకు పంపారా? పన్నుల లెక్కలు పరిశీలించారా? బాధ్యులకు నోటీసులు ఇచ్చారా? చర్యలు తీసుకుంటే నివేదిక ఎక్కడుంది? తీసుకోకపోతే ఎందుకు? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలి. పంచాయతీ నుంచి మున్సిపాలిటీకి బదిలీ అయిన రికార్డులను భద్రపరచడం అధికారుల బాధ్యత. ప్రజల ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాల్సిన వ్యవస్థే తన రికార్డులను చూపలేకపోతే జవాబుదారీతనం ఎక్కడ?

ఆర్టీఐ సమాధానంలో సంచలనం..
ఫిర్యాదు ఫైల్ ఏది?

ఈ వ్యవహారంలో కీలక పరిణామం 2026 నవంబర్ 6న వెలువడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీ ప్రజా సమాచార అధికారి సమాధానం. 2025 మే 9న దాఖలైన ఆర్టీఐకి MCI/RTI/66/2025 లేఖ ద్వారా ఐదు అంశాలపై వివరాలు వెల్లడించారు. ఎంపీడీఓ విధులు, అధికారాలు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018, సంబంధిత నిబంధనల పరిధిలో ఉంటాయని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ఒకే నిర్దిష్ట గడువు లేదని, అది ఫిర్యాదు స్వభావం, వర్తించే నిబంధనలపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఆర్టీఐ సెక్షన్ 7(1) ప్రకారం సమాచారం అందించేందుకు సాధారణంగా 30 రోజుల గడువు ఉంటుందని వివరించారు. అయితే అసలు సంచలనం మిగతా సమాధానాల్లోనే ఉంది. 2025 ఏప్రిల్ 23న చేసిన ఫిర్యాదుపై యాక్షన్ టేకెన్ రిపోర్ట్ అందుబాటులో లేదని తెలిపారు. రుద్రారం పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల ప్రతులు కూడా లేవన్నారు. అసలు ఫిర్యాదు ఫైల్ నంబర్, ఇన్‌వార్డ్ రిజిస్టర్, నోట్ ఫైల్, ఎండార్స్‌మెంట్లు, అంతర్గత ఉత్తర ప్రత్యుత్తరాలు సైతం అందుబాటులో లేవని స్పష్టం చేశారు. దీంతో పన్నుల లెక్కలపై మొదలైన ప్రశ్నలు ఇప్పుడు ప్రభుత్వ రికార్డుల భద్రత వరకు చేరాయి. ఫిర్యాదు ఎక్కడికి వెళ్లింది? ఇన్‌వార్డ్ రిజిస్టర్‌లో ఎందుకు లేదు? మున్సిపాలిటీకి రికార్డులు అప్పగించారా? అప్పగిస్తే అవి ఎక్కడున్నాయి? అప్పగించకపోతే బాధ్యత ఎవరిది? నిర్లక్ష్యమా? రికార్డుల గల్లంతా? ఉద్దేశపూర్వకంగా దాచడమా? అన్నది తేలాలి. అయితే రికార్డులు అందుబాటులో లేవన్న సమాధానమే వాటిని ఉద్దేశపూర్వకంగా మాయం చేశారనే నిర్ధారణకు ఆధారం కాదు. రికార్డుల బదిలీ పత్రాలు, నిర్వహణ రిజిస్టర్లు, బాధ్యతలు స్వీకరించిన అధికారుల వివరాలను పరిశీలించి వాస్తవాలు తేల్చాలి. ప్రజల ఫిర్యాదులకే రికార్డులు లేకపోతే ప్రభుత్వ వ్యవస్థల జవాబుదారీతనం ఏమైంది?

దోషులెవరు? వ్యవస్థలను చెప్పుచేతుల్లోకి తీసుకుంటున్నదెవరు?

2026 నవంబర్ 10న తెలంగాణ సమాచార కమిషన్ ముందు రుద్రారం వ్యవహారం మరోసారి విచారణకు వచ్చింది. ఇస్నాపూర్ మున్సిపాలిటీ అధికారులు నవంబర్ 6న ఇచ్చిన ఆర్టీఐ సమాధానాన్ని సమర్పించినప్పటికీ, అది అసంపూర్ణంగా ఉందని ఫిర్యాదుదారుడు అభిప్రాయపడ్డారు. అసలు ఫిర్యాదు, యాక్షన్ టేకెన్ రిపోర్ట్, ఉత్తర ప్రత్యుత్తరాలు, ఇన్‌వార్డ్ రిజిస్టర్ అందుబాటులో లేకపోవడంపై స్పష్టత రాలేదు. దీంతో బాధ్యుల పాత్రను విడివిడిగా పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు పన్నుల అంచనా, డిమాండ్లు, వసూళ్లు, రసీదులు, బ్యాంకు జమలు, వార్షిక లెక్కలను సక్రమంగా నిర్వహించారా? పన్ను నోటీసులు జారీ చేశారా? మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు తమ చట్టబద్ధ బాధ్యతలను నిర్వర్తించారా? అనే అంశాలు తేలాలి. 2025 ఏప్రిల్ 23న అందిన ఫిర్యాదుపై పటాన్‌చెరు ఎంపీడీఓ కార్యాలయం ఏం చర్యలు తీసుకుంది? విచారణకు ఆదేశించిందా? రికార్డులు ఎందుకు లేవు? రుద్రారం పంచాయతీ విలీన సమయంలో పాత రికార్డులను ఇస్నాపూర్ మున్సిపాలిటీ స్వీకరించిందా? వాటిని భద్రపరిచే బాధ్యత ఎవరిది? జిల్లా పంచాయతీ, ఆడిట్ అధికారులు గతంలో తనిఖీలు నిర్వహించారా? ఆడిట్ అభ్యంతరాలపై చర్యలు తీసుకున్నారా? అన్నది విచారణలో వెల్లడించాలి. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారా? పన్ను చెల్లించాల్సిన సంస్థలకు అనధికారికంగా రక్షణ కల్పించారా? ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగిందా? అనే ప్రశ్నలకూ ఆధారాలతో సమాధానం రావాలి. అయితే ఎవరినీ ముందుగానే దోషులుగా నిర్ధారించకుండా ఆస్తుల యాజమాన్యం, భూమి వినియోగం, అనుమతులు, పన్ను మినహాయింపులు, చెల్లింపులను పరిశీలించాలి. అక్రమ ఆక్రమణలు లేదా పన్ను ఎగవేత నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకుని బకాయిలు వసూలు చేయాలి. పదవులు మారినా బాధ్యతలు మారవు.. ప్రజాధనానికి లెక్క చెప్పాల్సిందే!



పాలకులు ఇప్పుడేం చేయాలి? సమగ్ర విచారణతోనే నిజాలు బయటకు!

రుద్రారం ఆస్తి పన్నుల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ కమిషనర్, ఇస్నాపూర్ మున్సిపల్ యంత్రాంగం తక్షణమే స్వతంత్ర విచారణకు ఆదేశించాలి. 2011-12 నుంచి 2024-25 వరకు రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ పన్నుల అంచనాలు, వసూళ్లు, బకాయిలను ఏడాదివారీగా పరిశీలించాలి. అసెస్‌మెంట్ రిజిస్టర్లు, డిమాండ్ అండ్ కలెక్షన్ రిజిస్టర్లు, రసీదులు, క్యాష్‌బుక్స్, బ్యాంకు స్టేట్‌మెంట్లు, ఆడిట్ నివేదికలను పోర్టల్ గణాంకాలతో సరిపోల్చాలి. వసూలైన సొమ్ము ఖాతాల్లో జమైందా? లెక్కల్లో సవరణలు ఎవరి అనుమతితో జరిగాయి? అనేది తేల్చాలి. రుద్రారంలోని విద్యాసంస్థలు, పరిశ్రమలు, హాస్టళ్లు, వాణిజ్య భవనాలపై ప్రత్యేక సర్వే నిర్వహించి, గీతం యూనివర్సిటీ, ఎంవైకే లాటిక్రీట్ సంస్థల పన్నుల అంచనా, చెల్లింపులు, మినహాయింపు లను పరిశీలించాలి. పంచాయతీ నుంచి మున్సిపాలిటీకి రికార్డుల బదిలీ, అసలు ఫిర్యాదు, ఇన్‌వార్డ్ రిజిస్టర్, నోట్ ఫైల్, యాక్షన్ టేకెన్ రిపోర్ట్ గల్లంతుపైనా విచారణ జరపాలి. నిర్లక్ష్యం లేదా ఉద్దేశపూర్వక చర్యలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఆర్థిక అవకతవకలు రుజువైతే తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018, వర్తించే మున్సిపల్ చట్టాలు, సేవా నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు చేపట్టాలి. నిధుల దుర్వినియోగం, మోసం, అవినీతి వంటి నేరాలు ఆధారాలతో నిర్ధారణ అయితే భారతీయ న్యాయ సంహిత-2023, అవినీతి నిరోధక చట్టం-1988 ప్రకారం చర్యలు ప్రారంభించాలి. ఆర్టీఐ చట్టం ఉల్లంఘనలపై సమాచార కమిషన్ సెక్షన్ 20 పరిధిలో విచారణ జరపాలి. చట్టబద్ధ ఉల్లంఘనలు నిర్ధారణ కాకుండా శిక్ష విధించకూడదు. చెల్లించాల్సిన పన్నుల బకాయిలను లెక్కించి వసూలు చేసి, విచారణ నివేదికను ప్రజలకు వెల్లడించాలి. పదకొండేళ్లు పన్నులు నిల్‌గా ఎందుకు నమోదయ్యాయి? అర్హత కలిగిన సంస్థలకు పన్నులు విధించారా? ప్రభుత్వ ఆదాయం ఖాతాల్లోకి చేరిందా? ఫిర్యాదు రికార్డులు ఏమయ్యాయి? తప్పు చేసినవారెవరు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. పంచాయతీ మున్సిపాలిటీలో విలీనమైనా గత వ్యవహారాలపై బాధ్యత ముగిసిపోదు. అధికారులు మారినా, పాలకులు మారినా ప్రజాధనానికి లెక్క చెప్పాల్సిందే.

ఒకప్పుడు ఆకలేస్తే హోటల్‌కు వెళ్లాలి. కూరగాయలు కావాలంటే మార్కెట్‌కు వెళ్లాలి. ఇంట్లో సరుకులు నిండుకోవాలంటే కిరాణా దుకాణానికి వెళ్లాలి. పండుగ వస్తే స్వీట్స్ షాపు ముందు నిలబడాలి. ఏదైనా వస్తువు కొనాలంటే దుకాణాల వెంట తిరగాలి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆకలేస్తోందా? స్విగ్గీ లేదా జొమాటోలో ఆర్డర్ చేయండి. ఇంట్లో పాలు, కూరగాయలు, బియ్యం అయిపోయాయా? బ్లింకిట్, జెప్టో, బిగ్‌బాస్కెట్ తెరవండి. కొత్త మొబైల్ కావాలా? అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో వెతకండి. స్వీట్స్ కావాలా? ఇష్టమైన దుకాణం నుంచి ఇంటికే తెప్పించుకోండి. చివరకు చిన్న వస్తువు నుంచి పెద్ద ఎలక్ట్రానిక్ పరికరం వరకు స్మార్ట్‌ఫోన్‌లోనే కొనుగోలు చేసే పరిస్థితి వచ్చింది. ఇది కేవలం సాంకేతిక పరిజ్ఞానం తెచ్చిన మార్పు కాదు. మనిషి జీవనశైలి, కొనుగోలు అలవాట్లు, వ్యాపార పద్ధతులు, ఉపాధి అవకాశాలను మార్చేసిన ఆర్థిక విప్లవం. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి రావడంతో ఆన్‌లైన్ వ్యాపారం విస్తరించింది. అమెరికా, చైనా, యూరప్ దేశాల్లో ప్రారంభమైన ఈ మార్పులు భారత్‌లోనూ వేగంగా విస్తరించాయి. కరోనా సమయంలో బయటకు వెళ్లలేని పరిస్థితులు ఆన్‌లైన్ కొనుగోళ్లకు మరింత ప్రాధాన్యత తెచ్చాయి. ఆ తర్వాత ప్రజలు తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చినా ఈ అలవాటు మాత్రం కొనసాగింది. గతంలో దుకాణం దగ్గరకు వినియోగదారుడు వెళ్లేవాడు. ఇప్పుడు దుకాణమే వినియోగదారుడి ఇంటికి వస్తోంది. గతంలో వ్యాపారి తన ప్రాంతంలోని ప్రజలకే సరుకులు అమ్మేవాడు. ఇప్పుడు ఒకే డిజిటల్ వేదిక ద్వారా వేలాది దుకాణాలు లక్షలాది మంది వినియోగదారులకు చేరువవుతున్నాయి. ఈ మార్పులో అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే కొనుగోలుదారుడికి కనిపించేది ఒక్క ఆర్డర్ బటన్ మాత్రమే. కానీ ఆ బటన్ వెనుక ఉత్పత్తిదారుడు, గిడ్డంగి, వ్యాపారి, సాంకేతిక సంస్థ, చెల్లింపుల వ్యవస్థ, డెలివరీ కార్మికుడు ఇలా అనేక మంది పనిచేస్తున్నారు. ఒక చిన్న ఆర్డర్ వెనుక ఎంత పెద్ద వ్యాపార గొలుసు పనిచేస్తుందో తెలుసుకుంటే నిజంగా ఆశ్చర్యపోవాల్సిందే.



ఆకలేస్తే ఆర్డర్.. అవసరమైతే ఆన్‌లైన్!

ఇంటి గుమ్మం వద్దకు ప్రపంచ మార్కెట్..
ఆన్‌లైన్ ఆర్డర్లతో మారిన ప్రపంచం..!
రాష్ట్రాల బడ్జెట్‌ను మించిన యాపారమా..!?

వేల కోట్ల వ్యాపారం..
ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొత్త శక్తి!

ఆన్‌లైన్ ఆర్డర్ల వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద వ్యాపార రంగాల్లో ఒకటిగా ఎదిగింది. అమెరికాలో అమెజాన్ వంటి సంస్థలు ఈ-కామర్స్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్లగా, చైనాలో అలీబాబా, మీటువాన్ వంటి సంస్థలు కొనుగోళ్లు, ఆహార పంపిణీ రంగాలను విస్తరించాయి. యూరప్‌లో డెలివరూ, జస్ట్ ఈట్ వంటి సంస్థలు ఆహార డెలివరీకి కొత్త మార్కెట్ సృష్టించాయి. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులు దుకాణానికి వెళ్లకుండా మొబైల్ ద్వారా వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. భారత్‌లోనూ ఈ మార్కెట్ వేగంగా పెరుగుతోంది. ఇండియా బ్రాండ్స్ ఈక్విటీ ఫౌండేషన్ (ఐబీఈఎఫ్) 2026 నివేదిక ప్రకారం 2024లో భారత ఈ-కామర్స్ మార్కెట్ విలువ సుమారు రూ.10.82 లక్షల కోట్లు. 2030 నాటికి ఇది రూ.29.88 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. ఇక ఆహార డెలివరీ రంగంలోనూ భారీ విస్తరణ కనిపిస్తోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్ విలువ సుమారు రూ.90,100 కోట్లు. 2030 నాటికి రూ.2.30 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనాలు చెబుతున్నాయి. ఈ వ్యాపారంలో జొమాటో, స్విగ్గీ ప్రధాన సంస్థలుగా నిలిచాయి. జొమాటో మాతృసంస్థ పేరు ఇప్పుడు ఎటర్నల్‌గా మారింది. 2026 ఆర్థిక సంవత్సరంలో జొమాటో ప్లాట్‌ఫామ్ ద్వారా 97.9 కోట్ల ఆర్డర్లు నమోదయ్యాయి. స్విగ్గీ ద్వారా 71.43 కోట్ల ఆర్డర్లు వచ్చాయి. అంటే ఈ రెండు సంస్థల ద్వారానే ఏడాదిలో దాదాపు 169 కోట్ల ఆహార ఆర్డర్లు పూర్తయ్యాయి. ఆర్డర్ల సంఖ్య ఆధారంగా చూస్తే జొమాటో వాటా సుమారు 57.8 శాతం, స్విగ్గీ వాటా 42.2 శాతంగా ఉంటుంది. ఇది ఆ రెండు సంస్థల ఆర్డర్లను మాత్రమే తీసుకున్న లెక్క. మొత్తం భారత మార్కెట్‌లో వాటాగా భావించకూడదు. మరోవైపు ఆన్‌లైన్ వస్తువుల విక్రయాల్లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. 2025లో భారత ఈ-కామర్స్ మార్కెట్‌లో ఈ రెండు సంస్థల ఉమ్మడి వాటా సుమారు 62 శాతంగా ఉందని గోల్డ్‌మన్ శాక్స్ నివేదికను ఉటంకిస్తూ ఆర్థిక నివేదికలు వెల్లడించాయి. వీటితో పాటు మీషో, జియోమార్ట్, ఇతర సంస్థలు కూడా పోటీలో ఉన్నాయి. అంటే ఆన్‌లైన్ ఆర్డర్ అనేది చిన్న వ్యాపారం కాదు. లక్షల కోట్ల రూపాయల ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. ఈ వ్యవస్థలో సంస్థలు సంపాదించే ఆదాయం, వినియోగదారులు చేసే మొత్తం కొనుగోళ్ల విలువ వేర్వేరు. ఆ తేడాను అర్థం చేసుకోవడం కూడా ముఖ్యం.

స్విగ్గీ నుంచి అమెజాన్ వరకు..
ఎవరి వాటా ఎంత?

ఆన్‌లైన్ వ్యాపారంలో ప్రతి సంస్థ అందించే సేవ వేరు. అందుకే వాటి మార్కెట్ వాటాను ఒకే ప్రాతిపదికన పోల్చలేం. స్విగ్గీ, జొమాటో ఆహార డెలివరీలో ఉంటే, బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, బిగ్‌బాస్కెట్ నౌ నిత్యావసరాలను వేగంగా చేరుస్తున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ మొబైల్ ఫోన్ల నుంచి దుస్తులు, గృహోపకరణాల వరకు విక్రయిస్తున్నాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో క్విక్ కామర్స్ ఆర్డర్లను పరిశీలిస్తే బ్లింకిట్ 91.66 కోట్లు, జెప్టో 64.02 కోట్లు, ఇన్‌స్టామార్ట్ 41.22 కోట్ల ఆర్డర్లు నమోదు చేశాయి. ఈ మూడు సంస్థల మొత్తం ఆర్డర్లలో బ్లింకిట్ వాటా 46.6 శాతం, జెప్టో 32.5 శాతం, ఇన్‌స్టామార్ట్ 20.9 శాతంగా ఉంది. అయితే ఈ లెక్కల్లో బిగ్‌బాస్కెట్, అమెజాన్ నౌ, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ లేవు. కాబట్టి ఇవి మొత్తం మార్కెట్ వాటా కాదు. కంపెనీల ఆదాయాల విషయానికొస్తే, 2026 ఆర్థిక సంవత్సరంలో ఎటర్నల్ కన్సాలిడేటెడ్ కార్యకలాపాల ఆదాయం రూ.54,364 కోట్లు కాగా, అందులో ఆహార డెలివరీ వాటా రూ.10,159 కోట్లు. స్విగ్గీ కార్యకలాపాల ఆదాయం రూ.23,053 కోట్లు. జెప్టో పెట్టుబడిదారుల పత్రాల ప్రకారం ఆదాయం సుమారు రూ.22,624 కోట్లు. అయితే ఈ సంఖ్యలను నేరుగా పోల్చలేం. ఎందుకంటే కొన్ని సంస్థలు మొత్తం అమ్మకాల విలువను, మరికొన్ని కమిషన్లు, సేవా రుసుములు, ప్రకటనల ఆదాయాన్ని లెక్కిస్తాయి. బిగ్‌బాస్కెట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకూ ఇదే వర్తిస్తుంది. కంపెనీలకు డెలివరీ ఛార్జీలు, ప్లాట్‌ఫామ్ ఫీజులు, వ్యాపారుల కమిషన్లు, ప్రకటనలు, సభ్యత్వ పథకాలు, ఇతర సేవల ద్వారా ఆదాయం వస్తుంది. రెస్టారెంట్లు విక్రయాలపై కమిషన్ చెల్లిస్తే, కిరాణా వ్యాపారులు డిజిటల్ వేదికల ద్వారా వినియోగదారులను చేరుకుంటారు. ఉత్పత్తి సంస్థలు తమ బ్రాండ్ల ప్రచారానికి ప్రకటనలు ఇస్తాయి. ఇలా ఒక్కో ఆర్డర్ వెనుక అనేక ఆదాయ మార్గాలు పనిచేస్తున్నాయి. అయితే భారీ ఆదాయం అంటే అంతే స్థాయిలో లాభాలు వచ్చినట్లు కాదు. గిడ్డంగుల నిర్వహణ, సిబ్బంది జీతాలు, సాంకేతిక వ్యయం, డిస్కౌంట్లు, ప్రకటనలు, డెలివరీ ప్రోత్సాహకాలు, ఇతర నిర్వహణ ఖర్చులు కూడా కంపెనీలపై భారీ భారంగా ఉంటాయి.

ఉత్పత్తిదారుడి నుంచి వినియోగదారుడి వరకు..
కొత్త ఆర్థిక గొలుసు!

ఆన్‌లైన్ ఆర్డర్ వ్యవస్థలో రైతు నుంచి వినియోగదారుడి వరకు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక పాత్ర ఉంది. రైతు పండించిన పంట గిడ్డంగికి చేరితే, సరఫరాదారుడి ద్వారా దుకాణానికి వస్తుంది. డిజిటల్ వేదిక ఆ దుకాణాన్ని వినియోగదారుడితో అనుసంధానిస్తుంది. ఆర్డర్ అందుకున్న డెలివరీ కార్మికుడు సరుకును ఇంటికి చేరుస్తాడు. ఇలా ఒక చిన్న ఆర్డర్ వెనుక రైతు, రవాణాదారుడు, గిడ్డంగి సిబ్బంది, వ్యాపారి, యాప్ నిర్వాహకుడు, డెలివరీ బాయ్ శ్రమ దాగి ఉంటుంది. రెస్టారెంట్ ఆర్డర్‌లోనూ ఇదే గొలుసు పనిచేస్తుంది. ఈ వ్యవస్థ చిన్న వ్యాపారులకు స్థానిక మార్కెట్ దాటి వేలాది మంది వినియోగదారులను చేరుకునే అవకాశం కల్పించింది. అయితే కమిషన్లు, డెలివరీ ఖర్చులు, ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడటం వంటి సవాళ్లూ ఉన్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో స్థానిక దుకాణాలు, చిన్న రెస్టారెంట్లు, బైక్ డెలివరీ నెట్‌వర్క్, డిజిటల్ చెల్లింపులతో ప్రత్యేక వ్యాపార నమూనా ఏర్పడింది. చైనాలో భారీ డిజిటల్ వాణిజ్య వ్యవస్థలు, అమెరికాలో విస్తృత గిడ్డంగులు, యూరప్‌లో కార్మికుల హక్కులకు ప్రాధాన్యత కనిపిస్తాయి. భారత్‌లో యూపీఐ చెల్లింపులు ఈ వ్యవస్థకు మరింత ఊతమిచ్చాయి. నగదు అవసరం లేకుండా మొబైల్‌తోనే కొనుగోళ్లు చేయడం సులభమైంది. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో ఈ సేవలు విస్తరిస్తున్నాయి. ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, కుటుంబాలతో పాటు స్థానిక హోటళ్లు, స్వీట్స్ షాపులు, కిరాణా దుకాణాలకూ కొత్త వ్యాపార అవకాశాలు లభిస్తున్నాయి. అయితే ఈ అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందాలి. రైతుకు గిట్టుబాటు ధర, వ్యాపారికి తగిన ఆదాయం, డెలివరీ కార్మికుడికి గౌరవప్రదమైన పారితోషికం, వినియోగదారుడికి నాణ్యమైన సరుకు అందాలి. కంపెనీలు కార్మికుల భద్రత, సంక్షేమంపై దృష్టి పెట్టాలి. ప్రభుత్వాలు పర్యవేక్షణను బలోపేతం చేయాలి. ప్రజలు అవసరానికి మాత్రమే ఆర్డర్లు చేస్తూ డెలివరీ సిబ్బంది శ్రమను గౌరవించాలి. ఎందుకంటే ఈ వ్యవస్థలో లాభపడేది ఒక్క కంపెనీ మాత్రమే కాదు. సక్రమంగా నడిస్తే ఉత్పత్తిదారుడి నుంచి వినియోగదారుడి వరకు ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కలుగుతుంది. ఒకప్పుడు మార్కెట్‌కు వెళ్లిన మనిషి ఇప్పుడు మార్కెట్‌నే ఇంటికి తెచ్చుకుంటున్నాడు. వేలాది దుకాణాలు అరచేతిలో ప్రత్యక్షమవుతున్నాయి. మొబైల్ తెరపై నొక్కే ఒక్క బటన్ వెనుక ఇంత పెద్ద ఆర్థిక వ్యవస్థ పనిచేస్తోంది. సౌకర్యం, వ్యాపారం, ఉపాధి, సాంకేతికతను అనుసంధానించిన ఈ కొత్త ఆర్థిక విప్లవమే ఆన్‌లైన్ ఆర్డర్ల ప్రపంచం.




ఆర్డర్ వెనుక అసలు మనిషి.. డెలివరీ బాయ్ జీవితమేంటి?

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సరుకు ఇంటికి చేరుతుంది. కానీ ఆ సౌకర్యం వెనుక డెలివరీ కార్మికుడి శ్రమ, సవాళ్లు చాలామందికి కనిపించవు. వినియోగదారుడు యాప్‌లో ఆర్డర్ చేయగానే కంపెనీ సర్వర్ ద్వారా సమీపంలోని దుకాణం లేదా రెస్టారెంట్‌కు సమాచారం చేరుతుంది. వ్యాపారి సరుకు సిద్ధం చేస్తే, డెలివరీ భాగస్వామి బైక్‌పై తీసుకెళ్లి ఇంటికి అందిస్తాడు. ఈ ప్రయాణంలో ట్రాఫిక్, ఎండ, వర్షం, రోడ్డు సమస్యలను ఎదుర్కొంటూనే నిర్ణీత సమయంలో ఆర్డర్ అందించాల్సిన ఒత్తిడి ఉంటుంది. ఆర్డర్ల సంఖ్య, ప్రయాణ దూరం, ప్రోత్సాహకాల ఆధారంగా ఆదాయం మారుతుంది. పెట్రోల్, వాహన నిర్వహణ, మొబైల్ డేటా ఖర్చులు కూడా వారివే. అనారోగ్యం లేదా ప్రమాదంతో పని ఆగితే ఆదాయమూ నిలిచిపోతుంది. స్థిర వేతనం, సెలవులు, భవిష్యనిధి వంటి ఉద్యోగ ప్రయోజనాలు అందరికీ అందుబాటులో లేవు. యాప్‌ల ద్వారా పనిచేస్తున్న వీరిని గిగ్ వర్కర్లుగా పరిగణిస్తుండటంతో వారి సామాజిక భద్రత కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల నమోదు, సామాజిక భద్రత, సంక్షేమ చట్టం 2026 ఏప్రిల్ 25న గవర్నర్ ఆమోదం పొందగా, ఏప్రిల్ 28న గెజిట్‌లో ప్రచురితమైంది. జూన్ 2 నుంచి అమల్లోకి వచ్చింది. నవంబర్ 14న హైదరాబాద్ హైటెక్ సిటీ సమీపంలోని జయభేరి గ్రౌండ్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంక్షేమ విధానాన్ని ప్రారంభించి, కార్మికుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇందులో రూ.5 లక్షల జీవిత బీమా, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల ఆరోగ్య భద్రత, ప్రత్యేక సంక్షేమ బోర్డు, గుర్తింపు కార్డులు కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి లావాదేవీపై ఒక శాతం సంక్షేమ నిధికి జమ చేసే విధానాన్ని కూడా ప్రకటించింది. కనీస పారితోషికం, పారదర్శక చెల్లింపులు, కారణం లేకుండా అకౌంట్ల నిలిపివేతకు రక్షణ వంటి హక్కులకు నిబంధనల్లో ప్రాధాన్యత ఇచ్చింది. ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షలు, అంత్యక్రియలకు రూ.30 వేలు, శాశ్వత పూర్తి అంగవైకల్యానికి రూ.5 లక్షల సహాయం వంటి ప్రయోజనాలను పేర్కొంది. ఆరు లక్షలకు పైగా గిగ్ కార్మికులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. అయితే ప్రకటనలకే ఈ పథకాలు పరిమితం కాకుండా కార్మికుల నమోదు, బీమా అమలు, ఫిర్యాదుల పరిష్కారం, కంపెనీల నుంచి సంక్షేమ నిధుల వసూలు సమర్థంగా జరగాలి. ఎందుకంటే మన ఇంటి గుమ్మం వద్దకు ఆర్డర్ తీసుకొచ్చే వ్యక్తి కేవలం డెలివరీ బాయ్ కాదు.. మన సౌకర్యం కోసం ఎండనక, వాననక శ్రమించే కార్మికుడు. అతడి శ్రమకు తగిన గుర్తింపు, జీవితానికి భద్రత కల్పించడం సమాజం, ప్రభుత్వాల బాధ్యత.



ఆన్‌లైన్ ఆర్డర్ల వ్యవస్థ ఉద్యోగులు, వృద్ధులు, ఒంటరిగా నివసించే వారు, సమయం తక్కువగా ఉన్న కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ఎండైనా, వానైనా, రాత్రి వేళైనా అవసరమైన వస్తువులను ఇంటికే తెప్పించుకోవచ్చు. ఒకే యాప్‌లో ధరలు పోల్చుకోవడం, డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్, సభ్యత్వ ప్రయోజనాలు పొందడం సాధ్యమవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు వంటి నగరాల్లో ఈ సేవలు దైనందిన జీవితంలో భాగమయ్యాయి. హైదరాబాద్‌లో ఉద్యోగులు కార్యాలయాలకే భోజనం తెప్పించుకుంటుండగా, కుటుంబాలు కిరాణా సరుకులు, పండుగలు, వేడుకల కోసం స్వీట్స్, బహుమతులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నాయి. చిన్న రెస్టారెంట్లు, స్వీట్స్ షాపులు, స్థానిక కిరాణా వ్యాపారులకు విస్తృత మార్కెట్ లభిస్తోంది. కొన్ని డిజిటల్ వేదికలు రైతుల ఉత్పత్తులకూ కొత్త మార్కెట్ కల్పిస్తున్నాయి. అయితే ఈ సౌకర్యం అనవసర కొనుగోళ్లకు దారితీస్తోందా? ఆకలేస్తేనే ఆర్డర్ చేస్తున్నామా? లేక ఆఫర్లు, డిస్కౌంట్ల ఆకర్షణకు లోనై అవసరం లేకున్నా కొనుగోలు చేస్తున్నామా? ఇంట్లో సరుకులున్నా మళ్లీ తెప్పించుకుంటున్నామా? అన్నది ఆలోచించాలి. కొన్నిసార్లు పది రూపాయల వస్తువుకు ఇరవై రూపాయల డెలివరీ ఛార్జీ చెల్లించాల్సి వస్తోంది. ఉచిత డెలివరీ పేరుతో కనీస ఆర్డర్ విలువ పెంచడం, వేగవంతమైన డెలివరీ ప్రకటనలు, నిరంతర ఆఫర్లు వినియోగదారులను మరిన్ని కొనుగోళ్లకు ప్రేరేపిస్తున్నాయి. ముఖ్యంగా యువతలో తక్షణ కొనుగోలు అలవాటు పెరుగుతోంది. అంతేకాదు, దుకాణాల్లోని ధరలతో పోలిస్తే కొన్ని వస్తువులు ఆన్‌లైన్‌లో ఎక్కువ ధరకు లభించవచ్చు. రెస్టారెంట్ల ధరలు, యాప్‌లోని ధరలు కూడా భిన్నంగా ఉండవచ్చు. అందుకే డిస్కౌంట్ కనిపించగానే ఆర్డర్ చేయకుండా అవసరం, ధర, నాణ్యత, డెలివరీ ఛార్జీలను పరిశీలించాలి. సౌకర్యం సమయాన్ని ఆదా చేయాలి కానీ అనవసర ఖర్చులకు కారణం కాకూడదు. వినియోగదారుడికి ప్రయోజనం, వ్యాపారికి ఆదాయం, డెలివరీ కార్మికుడికి గౌరవప్రదమైన సంపాదన లభించినప్పుడే ఆన్‌లైన్ ఆర్డర్ల వ్యవస్థ నిజమైన విజయాన్ని సాధించినట్లు.




కోహ్లీ నాయకత్వంలోనే టీమిండియా దూకుడు!

భారత జట్టును విరాట్ కఠినంగా మార్చేశాడు

టీమిండియా క్రికెట్‌లో విరాట్ కోహ్లీ ముద్ర ఎంత బలంగా పడిందో దక్షిణాఫ్రికా దిగ్గజాలు డేల్ స్టెయిన్, ఫాఫ్ డుప్లెసిస్ మాటల్లో మరోసారి స్పష్టమైంది. కోహ్లీతో సహచరుడిగా, ప్రత్యర్థిగా, నాయకుడిగా కలిసి పనిచేసిన ఈ ఇద్దరూ అతడి వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలను ప్రశంసించారు. ముఖ్యంగా కోహ్లీ కెప్టెన్సీలో భారత జట్టు రూపురేఖలే మారిపోయాయని ఫాఫ్ వెల్లడించాడు. 2018 దక్షిణాఫ్రికా పర్యటనను గుర్తుచేసుకుంటూ.. అప్పటివరకు విదేశీ గడ్డపై బలహీనంగా కనిపించే భారత జట్టు కోహ్లీ నాయకత్వంలో మరింత కఠినంగా, పోరాటపటిమతో తయారైందని పేర్కొన్నాడు. ఫిట్‌నెస్‌కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా జట్టులో కొత్త సంస్కృతికి కోహ్లీ శ్రీకారం చుట్టాడని డేల్ స్టెయిన్ కొనియాడాడు. మైదానంలో అతడి తీవ్రత సహచర ఆటగాళ్ల లోనూ విద్యుత్ ఉత్సాహాన్ని నింపుతుందని ఫాఫ్ చెప్పాడు. ముఖ్యంగా కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయడం తన కెరీర్‌లో మరిచిపోలేని అనుభవమని వెల్లడించాడు. ఆస్ట్రేలియా గడ్డపై భారత్ తొలిసారి టెస్టు సిరీస్ గెలవడంలో కోహ్లీ నాయకత్వం కీలకమని స్టెయిన్ గుర్తు చేశాడు. కేవలం పరుగులు, రికార్డులకే పరిమితం కాకుండా భారత క్రికెట్ జట్టు ఆలోచనా విధానాన్ని, ఫిట్‌నెస్ స్థాయిని, విదేశీ గడ్డపై పోరాటతత్వాన్ని మార్చిన నాయకుడిగా కోహ్లీ నిలిచాడన్నది ఈ దిగ్గజాల అభిప్రాయం.

పాక్‌పై యువ భారత్ పంజా

గంభీర్ ప్రశంసల వర్షం!



'భయం లేని ఆట.. చెక్కుచెదరని నమ్మకం.. పోరాటానికి బ్యాటింగ్ ఆర్డర్‌తో సంబంధం లేదు.. ఆసియా ఛాంపియన్లకు అభినందనలు!' అంటూ టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అండర్-19 యువ జట్టుపై ప్రశంసలు కురిపించాడు. పాకిస్థాన్‌పై అద్భుత విజయం సాధించిన యువ ఆటగాళ్ల పోరాటపటిమకు ఫిదా అయ్యాడు. వికెట్లు వరుసగా పడుతున్నా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా చివరి బంతి వరకు పోరాడిన తీరు అసలైన ఛాంపియన్ల లక్షణమని తన వ్యాఖ్యలతో చాటిచెప్పాడు. గంభీర్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత్ 252 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో మనల్ చౌహాన్ (47), మొహిత్ ఉల్వా (49 నాటౌట్) అద్భుతంగా పోరాడారు. చివరి బంతికి మొహిత్ బౌండరీ బాది భారత్‌కు ఒక్క వికెట్ తేడాతో చారిత్రక విజయాన్ని అందించాడు. కెప్టెన్ లక్ష్య రైచందాని 80 పరుగులతో రాణించగా, ఆర్యవీర్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో 361 పరుగులతో టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచి ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డు అందుకున్నాడు. ఈ విజయంతో భారత్ తొమ్మిదోసారి అండర్-19 ఆసియా కప్‌ను కైవసం చేసుకుంది.

భారత ఆటగాళ్ల సంబరాలపై పాక్ దిగ్గజం క్లాస్!

యూసుఫ్ హితబోధకు నెటిజన్ల నుంచి కౌంటర్!

అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించి తొమ్మిదోసారి టైటిల్ సాధించిన భారత యువ జట్టు సంబరాలు ఇప్పుడు మరో వివాదానికి తెరలేపాయి. చివరి బంతికి విజయాన్ని అందుకున్న ఆనందంలో భారత ఆటగాళ్లు మైదానంలో దూకుడుగా సంబరాలు చేసుకోవడం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. మనల్ చౌహాన్, మొహిత్ ఉల్వా, చిరుగుపాటి వెంకటతో పాటు పలువురు ఆటగాళ్లు పాక్ క్రికెటర్ల వైపు దూకుడుగా సంజ్ఞలు చేసినట్లు వీడియోలు వైరల్ అయ్యాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో భారత సహాయక సిబ్బంది మైదానంలోకి వచ్చి ఆటగాళ్లను అదుపు చేయాల్సి వచ్చింది. ఈ పరిణామంపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మహ్మద్ యూసుఫ్ స్పందిస్తూ యువ ఆటగాళ్లకు హితబోధ చేశారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ఆటగాళ్లు గౌరవంగా, సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. మైదానంలో ప్రవర్తన వారి పెంపకం, విలువలు, సంస్కారాలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. అయితే యూసుఫ్ వ్యాఖ్యలపై నెటిజన్లు వెంటనే ఎదురుదాడికి దిగారు. గతంలో ఇదే టోర్నీలో భారత్‌పై గెలిచినప్పుడు పాక్ ఆటగాళ్లు చేసిన దూకుడు సంబరాలను గుర్తుచేస్తూ ప్రశ్నలు సంధించారు. దీంతో యూసుఫ్ హితబోధపై సోషల్ మీడియాలో చర్చ మరింత వేడెక్కింది.



బ్యాట్‌తో మెరుపులు

బంతితో బుల్లెట్ వేగం!.. కివీస్‌పై చారిత్రక విజయం

భారత్ సిరీస్ కైవసం!

మౌంట్ మాంగనూయ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో వన్డేలో టీమిండియా అద్భుత పోరాటంతో అదరగొట్టింది. ఒక దశలో 150 పరుగులైనా దాటుతుందా అన్న సందేహం కలిగించిన భారత జట్టు.. చివరి వికెట్‌కు అర్ష్‌దీప్ సింగ్, మహమ్మద్ సిరాజ్ సృష్టించిన విధ్వంసంతో 200 పరుగుల మైలురాయిని దాటింది. వీరిద్దరూ బ్యాట్‌తో 14 పరుగుల చొప్పున మెరుపులు మెరిపించడమే కాకుండా, బంతితోనూ ప్రత్యర్థి వెన్నులో వణుకు పుట్టించారు. భారత్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ బ్యాటర్లు భారత పేసర్ల ధాటికి నిలవలేకపోయారు. సిరాజ్ ఆరంభంలోనే వికెట్ తీసి దూకుడు పెంచగా, అర్ష్‌దీప్ తన పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటింగ్‌ను కుప్పకూల్చాడు. వీరిద్దరూ కలిసి ఐదు వికెట్లు పడగొట్టి విజయానికి బాటలు వేశారు. అక్షర్ పటేల్ 46 పరుగులతో బ్యాటింగ్‌లో కీలక పాత్ర పోషించడంతో పాటు బౌలింగ్‌లోనూ రెండు వికెట్లు తీసి జట్టు విజయానికి తన వంతు సహకారం అందించాడు. అరంగేట్రం చేసిన యశ్ ఠాకూర్, జకీబ్ నబీ కూడా కీలక సమయాల్లో వికెట్లు తీసి సత్తా చాటారు. మరోవైపు ఇషాన్ కిషన్ 46 పరుగులతో పోరాడినా భారత ఇన్నింగ్స్‌కు భారీ స్కోరు అందించలేకపోయాడు. చివరకు న్యూజిలాండ్ 187 పరుగులకే ఆలౌట్ కావడంతో భారత్ 22 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో వన్డే సిరీస్‌ను 3-1తో సొంతం చేసుకుంది. గౌతమ్ గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత విదేశీ గడ్డపై భారత్‌కు ఇదే తొలి వన్డే సిరీస్ విజయం కావడం విశేషం. సొంతగడ్డపై ఏడు సంవత్సరాలుగా సిరీస్ ఓటమి ఎరుగని న్యూజిలాండ్‌కు భారత్ మరోసారి గట్టి షాక్ ఇచ్చింది. బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, బౌలర్ల సమష్టి పోరాటం టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది.



కుల్దీప్‌కు ఎదురుదెబ్బ.. జట్టులో చోటు గల్లంతు!

మూడు ఫార్మాట్ల నుంచి ఒక్క ఫార్మాట్‌కే పరిమితం!



ఒకప్పుడు మూడు ఫార్మాట్లలోనూ టీమిండియాకు ప్రధాన అస్త్రంగా ఉన్న మణికట్టు మాంత్రికుడు కుల్దీప్ యాదవ్ పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. న్యూజిలాండ్ పర్యటనలో అవకాశాల కోసం ఎదురుచూసిన ఈ స్పిన్నర్‌కు మైదానంలో నిరాశ ఎదురవ్వగా, జట్టులోనూ స్థానం గల్లంతైంది. మౌంట్ మాంగనూయ్ వేదికగా జరిగిన వన్డేలో నెల రోజుల విరామం తర్వాత బరిలోకి దిగిన కుల్దీప్ పూర్తిగా తడబడ్డాడు. ఎనిమిది ఓవర్లు వేసి 73 పరుగులు సమర్పించుకున్నా ఒక్క వికెట్ కూడా దక్కించుకోలేకపోయాడు. కివీస్ బ్యాటర్లు స్వీప్‌లు, రివర్స్ స్వీప్‌లతో అతడిపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా విల్ యంగ్ దూకుడుకు కుల్దీప్ దగ్గర సమాధానం లేకుండా పోయింది. ఈ ప్రదర్శన తర్వాతి రోజే మరో పిడుగుపాటు ఎదురైంది. న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ప్రకటించిన జట్టు నుంచి కుల్దీప్‌ను తప్పించి గూర్నూర్ బ్రార్‌కు అవకాశం కల్పించారు. కోచ్ గౌతమ్ గంభీర్ సైతం అవకాశాలు వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే వెస్టిండీస్‌తో గత వన్డే సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లో ఏడు వికెట్లు తీసి సత్తా చాటిన కుల్దీప్‌కు ఒక్క మ్యాచ్ వైఫల్యంతో ఇలాంటి పరిస్థితి రావడం చర్చనీయాంశమైంది. మూడు ఫార్మాట్లలో ఆడే స్థాయి నుంచి అవకాశాల కోసం ఎదురుచూసే స్థితికి చేరడం అతడికి పెద్ద ఎదురుదెబ్బే. ఇప్పుడు దేశవాళీ టీ20ల్లో సత్తా చాటి మళ్లీ జాతీయ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకోవాల్సిన సవాలు కుల్దీప్ ముందుంది.



కిరణ్ అబ్బవరం కొత్త అవతారం!

పాటలతో దూసుకొస్తున్న 'రియాలిటీ'

డిసెంబర్ 25న థియేటర్లలో సందడి!

సినిమా విడుదలకు ముందే పాటలతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకుంటోంది కిరణ్ అబ్బవరం తాజా చిత్రం 'రియాలిటీ'. ఇప్పటికే విడుదలైన 'భజ గోవిందం', 'రుత్తూ' పాటలు శ్రోతల నుంచి మంచి స్పందన అందుకుంటూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఒకదానికి మించి మరొకటి ఆకట్టుకుంటున్న ఈ పాటలు మ్యూజిక్ లవర్స్‌ను అలరిస్తుండటంతో చిత్ర బృందంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఇక ఇప్పుడు మూడో పాటతో మరోసారి మ్యూజికల్ మ్యాజిక్ సృష్టించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన 'రఘుకుల తిలక రా రా' పాటపై ప్రత్యేక ఆశలు పెట్టుకున్నారు. ఈ పాట కూడా చార్ట్‌బస్టర్‌గా నిలుస్తుందని చిత్ర బృందం భావిస్తోంది. కేవలం పాటలకే పరిమితం కాకుండా మధ్యతరగతి కుటుంబాల భావోద్వేగాలు, అనుబంధాలు, జీవితంలోని అనుభవాలను హృద్యంగా ఆవిష్కరించే ఫ్యామిలీ డ్రామాగా 'రియాలిటీ' తెరకెక్కుతోంది. ఈ సినిమాతో కిరణ్ అబ్బవరం తొలిసారిగా మెగాఫోన్ పట్టి దర్శకుడిగా కొత్త ప్రయాణం ప్రారంభిస్తున్నారు. దేవికా భట్ కథానాయికగా నటిస్తుండగా, శరత్ కుమార్, సాయికుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ, సుదర్శన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ ఎర్ర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డిసెంబర్ 25, 2026న క్రిస్మస్ కానుకగా థియేటర్లలోకి రానున్న 'రియాలిటీ'.. పాటల జోష్‌ను వెండితెరపై ఎలాంటి భావోద్వేగాల విందుగా మారుస్తుందో చూడాలి!

CINEMA NEWS

యుద్ధరంగంలో సీతమ్మ

విమర్శకులకు నితేశ్ తివారీ కౌంటర్!



సీతమ్మ అంటే సహనం.. త్యాగం.. ఓర్పు మాత్రమేనా? అవసరమైతే అధర్మంపై అస్త్రం ఎక్కుపెట్టే ఆదిపరాశక్తి కూడా కాదా? ఇప్పుడు ఇదే ప్రశ్నతో 'రామాయణం' చిత్రబృందం ప్రేక్షకుల ముందుకు సరికొత్త కోణాన్ని తీసుకొస్తోంది. సాయిపల్లవిని యోధురాలైన సీతగా చూపించడంపై వస్తున్న విమర్శలకు దర్శకుడు నితేశ్ తివారీ గట్టి వివరణ ఇచ్చారు. తమ చిత్రంలోని సీత పాత్రకు ఆధారం ఆధునిక ఆలోచనలు మాత్రమే కాదని, భారతీయ ఇతిహాసంలోని భిన్న రామాయణ గాథలేనని స్పష్టం చేశారు. సంస్కృత 'అద్భుత రామాయణం', 15వ శతాబ్దానికి చెందిన ఒడియా 'బిలంక రామాయణం'లో సీతను కేవలం కష్టాలను భరించే మూర్తిగా కాకుండా, మహాశక్తి స్వరూపిణిగా, యుద్ధవీరురాలిగా చిత్రించారని వెల్లడించారు. ముఖ్యంగా రాముడు అశక్తుడైన సమయంలో సీతమ్మ మహాకాళి రూపం ధరించి సహస్ర రావణుడనే వెయ్యి తలల రాక్షసుడిని సంహరించే ఘట్టాన్ని ప్రస్తావించారు. అందుకే సీత యుద్ధవిద్యలో పాల్గొనడాన్ని ఆధునిక స్త్రీవాద కోణంలో మాత్రమే చూడకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. కైకేయి పాత్రధారి లారా దత్తా కూడా సాయిపల్లవి పాత్రకు మద్దతుగా నిలిచారు. రాజకుటుంబాల్లోని యువరాజులు, యువరాణులకు ఆయుధ విద్యలో శిక్షణ ఉండేదని, ఆ పరిస్థితుల్లో సీత యుద్ధవిద్యలో ప్రావీణ్యం సంపాదించడం అసాధ్యమేమీ కాదని పేర్కొన్నారు. రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, రవిదూబే లక్ష్మణుడిగా, యష్ రావణుడిగా నటించిన ఈ రెండు భాగాల భారీ చిత్రంలో తొలి భాగం నవంబర్ 5న విడుదల కాగా, రెండో భాగం 2028లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సీతమ్మలోని శక్తిస్వరూపాన్ని వెండితెరపై ఎలా ఆవిష్కరిస్తారన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

రామాయణంపై ఆర్జీవీ బాంబ్

800 కోట్లలోపే తొలి భాగం బడ్జెట్

భారతీయ సినీ చరిత్రలో మరో మహా అద్భుతం ఆవిష్కృతం కాబోతోందా? వెండితెరపై రామాయణ గాథ సృష్టించబోయే ప్రభంజనం ప్రపంచ సినిమానే ఆశ్చర్యపరచబోతోందా? దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక 'రామాయణం' రెండు భాగాల బడ్జెట్‌పై జరుగుతున్న చర్చకు ఆర్జీవీ తనదైన శైలిలో తెరదించాడు. తొలి భాగం నిర్మాణ వ్యయం రూ.800 కోట్ల కంటే తక్కువేనని, పన్ను రాయితీలు, సబ్సిడీలు, వ్యాపార ఒప్పందాలతో అసలు భారం మరింత తగ్గుతుందని తనకు తెలిసిందని వెల్లడించాడు. రెండు భాగాలకు ఒకే స్థాయిలో ఖర్చవుతుందని భావించడం సరికాదని వ్యాఖ్యానించాడు. గేమింగ్‌తో పాటు భవిష్యత్తులో అనేక ప్రాజెక్టులకు ఉపయోగపడే భారీ విజువల్ ప్రపంచాన్ని నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారని ప్రశంసించాడు. తొలి భాగం థియేట్రికల్ వసూళ్లతోనే రెండు భాగాల పెట్టుబడిని సైతం రాబట్టే అవకాశం ఉందని అంచనా వేశాడు. ఇక అసలు విజువల్ వండర్ రెండో భాగంలోనే ఉంటుందని ఆర్జీవీ జోస్యం చెప్పాడు. హనుమంతుడి ఘట్టాలు, వానర సేన, రామసేతు నిర్మాణం, లంకాదహనం, కుంభకర్ణుడి వధ, రావణ సంహారం వంటి భారీ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు కనువిందు చేయనున్నాయని పేర్కొన్నాడు. 'కేజీఎఫ్-2' మొదటి భాగం కంటే ఐదు రెట్లు అధిక వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'రామాయణం-2' తొలి భాగం కంటే పది రెట్లు ఎక్కువ వసూళ్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశాడు.



మోసపోయాం జానకి.. నవ్వుల వేటలో ముగ్గురు!

2027లో థియేటర్లలోకి ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్

ఒక టైటిల్ చాలు.. ప్రేక్షకుల్లో ఆసక్తి రేపడానికి! ముగ్గురు స్నేహితులు.. చేతినిండా డబ్బు.. వెనుక ఏదో గందరగోళం.. ముందేమో పరుగుల పందెం! ఇలా ఫస్ట్‌లుక్ పోస్టర్‌తోనే నవ్వుల వేటకు తెరలేపింది 'మోసపోయాం జానకి'. 'పొట్టేల్' విజయంతో జోష్‌లో ఉన్న నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్ తమ మూడో ప్రొడక్షన్‌ను ఈ ఆసక్తికరమైన టైటిల్‌తో అధికారికంగా ప్రకటించింది. 2027లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా స్నేహం, సరదా, సాహసాలు, అంతులేని గందరగోళంతో థియేటర్లలో వినోదాల జాతర చేయడానికి సిద్ధమవుతోంది. ముగ్గురు స్నేహితుల గ్యాంగ్ చుట్టూ తిరిగే కథలకు తెలుగు సినిమాలో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. ఇప్పుడు అదే ఫార్ములాకు సరికొత్త కామెడీ టచ్ ఇస్తూ 'మోసపోయాం జానకి' తెరకెక్కుతోంది. ఫస్ట్‌లుక్‌లో డబ్బుతో ముగ్గురు వ్యక్తులు పరుగులు పెడుతున్న దృశ్యం చూస్తుంటే అసలు ఎవరిని ఎవరు మోసం చేశారు? ఆ డబ్బు ఎవరిది? జానకి ఎవరు? అనే ప్రశ్నలు ఆసక్తిని పెంచుతున్నాయి. యువతను ఆకట్టుకునే వినోదం, ఊహించని మలుపులు, నవ్వులు పంచే సన్నివేశాలతో ఈ చిత్రం రూపొందనుంది. సాయి సోహన్, నరేంద్ర రవి, విష్ణు ఓఐ, విస్మయ శ్రీ, హరితేజ, జీవన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్, సెవెన్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి మధుసూధన్ దర్శకత్వం వహిస్తున్నారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నారు.



This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.